

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | మంగళవారం 06-12-2022 | సంపుటి : 04 | సంచిక :93 | పేజీలు : 4 | వెల : రూ 3-00

# ధాన్యం కొనుగోళ్లపై సీఎం జగన్ కీలక ఆదేశాలు

## ఖరీఫ్ ధాన్యం సేకరణ, ఇతర పంటలపై సీఎం జగన్ సమీక్ష



అమరావతి: ఖరీఫ్ ధాన్యం సేకరణ, ఇతర పంటలపై వ్యవసాయ, పౌరసరఫరాల శాఖలతో తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. మిల్లర్ల ప్రమేయంలేకుండా సేకరిస్తున్న కొత్త విధానం అమలు తీరును సీఎం సమగ్రంగా సమీక్షించారు. ఈ మేరకు అధికారులకు సీఎం పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ, రైతులకు కనీస మద్దతు ధర కన్నా.. ఒక్కపైసా తగ్గకుండా రేటు రావాలనే ఉద్దేశంతో కొత్త విధానానికి శ్రీకారం చుట్టామన్నారు. దీని కోసం ధాన్యం సేకరణలో తొలిసారిగా మిల్లర్ల ప్రమేయాన్ని తీసివేశాం. ఈ కొత్త విధానం ఎలా అమలవుతున్నదీ గమనించుకుంటూ ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. చేయాల్సిన ధాన్యం సేకరణపై ముందస్తు అంచనాలు వేసుకుని, ఆ మేరకు ముందస్తుగానే గోనెసంచులు అందుబాటులోకి తీసుకురావాలి. వెంటనే దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు."రవాణా, లేబర్ ఖర్చుల రీయింబర్స్‌మెంట్‌లో జవాబుదారీతనం ఉండాలి. అత్యంత పారదర్శకంగా ఈ చెల్లింపులు ఉండాలి. ఈ విధానాన్ని ఒకసారి పరిశీలించి.. రైతులకు మేలు చేసేలా మరింత మెరుగ్గా దీన్ని తీర్చిదిద్దాలి. రవాణా ఖర్చులు, గన్నీ బ్యాగుల ఖర్చులను ప్రభుత్వం చెల్లిస్తోందన్న విషయం రైతులకు తెలియాలి. రైతులకు చేస్తున్న చెల్లింపులన్నీ కూడా అత్యంత పారదర్శకంగా ఉండాలి. ప్రత్యక్ష నగదు బదిలీ పద్ధతిలో కార్పొరేషన్ నుంచి వారికి డబ్బు చేరేలా చర్యలు తీసుకోవాలి. దీనివల్ల చెల్లింపుల్లో అత్యంత పారదర్శకత తీసుకు వచ్చినట్టు అవుతుంది" అని సీఎం పేర్కొన్నారు."ధాన్యం సేకరణ కోసం తయారు చేసిన యాప్‌లో.. సిగ్నల్స్ సమస్యల వల్ల అక్కడడక్కగా ఇబ్బందులు వచ్చే అవకాశాలు ఉంటాయి. ఆఫ్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకుని.. సిగ్నల్ ఉన్న ప్రదేశాల్లోకి వెళ్లగానే ఆ వివరాలన్నీ ఆటోమేటిక్‌గా ఆన్‌లైన్‌లోకి లోడ్ అయ్యేలా మార్పులు చేసుకోవాలి. అనేక ప్రభుత్వ శాఖల్లో ఇప్పటికే ఇలాంటి పద్ధతులు పాటిస్తున్నాం. ఆ శాఖల నుంచి తగిన సాంకేతిక సహకారాన్ని తీసుకోవాలి" అని సీఎం సూచించారు. ధాన్యం సేకరణ, కొనుగోళ్లపై సమాచారాన్ని సమగ్రంగా తెలియజేసేలా ఆర్బీకేల్లో పెద్ద పెద్ద పోస్టర్లు పెట్టాలని, దీనివల్ల రైతుల్లో అవగాహన కలుగుతుందన్న సీఎం. రైతుల ఫోన్లకూ ఈ సమాచారాన్ని ఆడియో, వీడియో రూపంలో పంపించాలన్నారు. ధాన్యం సేకరణకోసం అనుసరిస్తున్న సరికొత్త విధానం, ఈ ప్రక్రియలో ఏమేం చేస్తున్నామన్న దానిపై సంపూర్ణంగా సమాచారం వారికి చేరవేయాలి. దీనివల్ల రైతుల్లో అవగాహన కలుగుతుందని సీఎం అన్నారు. పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ల విధులపై ఎస్‌ఓపీలను తయారుచేయాలి. ఈ ఎస్‌ఓపీలను పాటించేలా సమర్ధవంతమైన పర్యవేక్షణ ఉండేలా చూడాలి. అవకతవకలకు, అవినీతికి ఆస్కారం లేకుండా ఈ ఎస్‌ఓపీలు ఉండాలి. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పంటల సాగుమీదకూడా రైతులకు అవగాహన కలిగించాలన్న సీఎం. అలాంటి రైతులను ప్రోత్సహించాలన్నారు. మన ప్రభుత్వం వచ్చాక మిల్లెట్స్ సాగును ప్రోత్సహిస్తున్నాం. ఎవరైనా మిల్లెట్స్ కావాలి అని అడిగితే, వాటిని వినియోగిస్తామని కోరితే పౌర సరఫరాలశాఖద్వారావారికి అందించడంపైన కూడా దృష్టిపెట్టాలి. కోరుకున్న వారికి వాటిని సరఫరా చేయాలని సీఎం సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయ, మార్కెటింగ్, సహకారశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఏపీ అగ్రిమిషన్ వైస్ చైర్మన్ ఎంవియస్ నాగిరెడ్డి, సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి, మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, ఆర్థికశాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, రవాణాశాఖ కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, పౌరసరఫరాల శాఖ కార్యదర్శి హెచ్ అరుణ్‌కుమార్, వ్యవసాయశాఖ కమిషనర్ సి.హరికిరణ్, మార్కెటింగ్‌శాఖ కమిషనర్ రాహుల్ పాండే, పౌర సరఫరాల డైరెక్టర్ విజయ సునీత, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము

తిరుమల, డిసెంబర్ 05 తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారిని సోమవారం ఉదయం భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము దర్శించుకున్నారు. రాష్ట్రపతి సోమవారం ఉదయం 9.30 గంటలకు తిరుమలలోని శ్రీ పద్మావతి విశ్రాంతి భవనం నుండి బయలు దేరి తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ శ్రీవారి పుష్కరిణిలో నీటిని ప్రోక్షణం చేసుకున్నారు. అనంతరం శ్రీ భూ వరహస్వామివారిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి శ్రీవారి ఆలయానికి చేరుకున్న రాష్ట్రపతికి టిటిడి ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఈవో ఏ.వి.ధర్మారెడ్డి సాదరంగా అహ్వానించగా, అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. ఆలయంలో ధ్వజస్తంభానికి నమస్కరించిన అనంతరం రాష్ట్రపతి శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీశ్రీశ్రీ పెద్దజీయంగార్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయంగార్ స్వామి ఉన్నారు. ఈ



సందర్భంగా శ్రీవారి ప్రధాన అర్చకులలో ఒకరైన వేణుగోపాల్ దీక్షితులు శ్రీవారి ఆలయ ప్రాశస్త్యాన్ని , సన్నిధిలోని ఇతర ఆలయాల గురించి వివరించారు. అనంతరం రంగనాయకుల మండపంలో రాష్ట్రపతికి వేదాశీర్వచనం చేశారు. ఛైర్మన్, ఈవో కలిసి శ్రీవారి శేష వస్త్రాన్ని, తీర్థప్రసాదాలను, రాష్ట్రపతి కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర టూరిజం శాఖ మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్య మంత్రులు నారాయణ స్వామి, సత్యనారాయణ, రాష్ట్ర మంత్రి రోజా, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్ కుమార్ సింఘాల్ , జిల్లా కలెక్టర్ వెంకట రమణా రెడ్డి , అదనపు డిజి రవిశంకర్ అయ్యర్ , డిఐజి రవిప్రకాష్ , సివి ఎస్వో నరసింహ కిషోర్ , తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, చిత్తూరు ఎస్పీ రిశాంత్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జగన్నాథగట్టుపై హైకోర్టు కడతాం: 'సీమగర్జన'లో మంత్రి బుగ్గన

కర్నూలు: కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు తెదేపా అధినేత చంద్రబాబు అనుకూలమో, వ్యతిరేకమో చెప్పాలని ఏపీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని జగన్నాథగట్టుపై హైకోర్టు కట్టబోతున్నట్లు ప్రకటించారు. హైకోర్టు ఏర్పాటు చేయాలంటూ వైకాపా ఆధ్వర్యంలో స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో



'సీమ గర్జన' సభ నిర్వహించారు. ఈ సభకు మంత్రులు అంజాద్ బాషా, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుమ్మనూరు జయరాంతో పాటు వైకాపాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బుగ్గన మాట్లాడుతూ కర్నూలు నలుచెరుగులా 10కి.మీ. కనిపించేలా జగన్నాథగట్టుపై హైకోర్టు నిర్మిస్తామని చెప్పారు. యువకులు, రైతులు, ప్రాంత భవిష్యత్తు, గౌరవం నిలబెట్టేందుకు హైకోర్టు సాధించేవరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. కచ్చితంగా హైకోర్టు సాధిస్తామని చెప్పారు. వైకాపా ప్రభుత్వం మాత్రమే కర్నూలులో న్యాయరాజధాని తేగలదని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే మళ్లీ అమరావతిలోనే రాజధాని పెడతారని వ్యాఖ్యానించారు. "అమరావతిలో రాజధాని వద్దని సీఎం జగన్ (అఓ ఏజీణజీని) ఏనాడూ చెప్పలేదు. న్యాయ రాజధాని కోసం అందరం కలిసికట్టుగా అడుగులు వేయాలి. మూడు ప్రాంతాలకూ న్యాయం చేయాలన్నదే సీఎం లక్ష్యం. జగన్ పట్టుదలకు మారుపేరు. ముక్తకంఠంతో న్యాయరాజధాని సాధించుకుందాం. శాసన వ్యవహారాల రాజధానిగా అమరావతి కొనసాగుతుంది." అని పెద్దిరెడ్డి అన్నారు.

# ఓటు హక్కును వినియోగించుకున్న ప్రధాని

అహ్మదాబాద్ ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. గుజరాత్?లో రెండో విడత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కొనసాగింది. ఈ విడతలో 14 జిల్లాల్లోని 93 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ కొనసాగింది. బరిలో 833 మంది అభ్యర్థులుండగా 2.54 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. మరోవైపు అహ్మదాబాద్ లో ప్రధాని మోదీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 89 అసెంబ్లీ స్థానాలకు ఈనెల 1న పోలింగ్ పూర్తయిన విషయం తెలిసిందే. అహ్మదాబాద్ లోని రానిప్ ప్రాంతంలోని నిషాన్ హై స్కూల్ లో అయన ఉదయం తన ఓటునువేసారు. అందుకుగాను అయన కొంతసేపు లైన్ లో నిలబడ్డారు. పోలింగ్ బూత్ నుంచి బయటకు వచ్చిన మోడీ ఓటు వేసినట్లు బయట ప్రజలకు తన వేలును చేసించారు. తరువాత అయన అక్కడికి దగ్గరలో వున్న తన సోదరుడు సోమ మోడీ ఇంటికి నడుచుకుంటూ వెళ్లారు.




# 10 తర్వాత ఎమ్మెల్యేలతో జగన్ భేటీ

విజయవాడ, డిసెంబర్ 5, ఎమ్మెల్యేలకు సీఎం జగన్ ఇచ్చిన గడువు పూర్తవుతోందా.. గడప గడపకు మన ప్రభుత్వం సమీక్షలో ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇదే చెప్పనున్నారా.. తాజా పరిణామాలు చూస్తే ఇలాగే ఉన్నాయి. ఈ నెల రెండో వారంలో పార్టీ ఎమ్మెల్యేలతో సీఎం జగన్ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలకు సంకేతాలు ఇచ్చిన జగన్ వచ్చే సమావేశంలో ఎలా రియాక్ట్ అవుతారన్న అంశం పై ఉత్కంఠ నెలకొంది. సీఎం జగన్ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేల పని తీరుపై రకరకాలుగా సర్వేలు నిర్వహిస్తున్నారు. ఇంచుమించు ప్రతి రోజు ఏదో ఒక సర్వే రిపోర్ట్ సీఎం దగ్గరకు వస్తోంది. పార్టీ పరిస్థితి ఎమ్మెల్యేల పని తీరును ఎప్పటికప్పుడు నివేదికల రూపంలో తీసుకుంటున్న సీఎం ఈ వ్యవహారాలపై ఆరా తీస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇంఛార్జీలు గడప గడపకు తిరుగుతున్నారు. ప్రతి ఇంటికి వెళ్లాలని సీఎం ఇచ్చిన ఆదేశాలతో ప్రతి గడప ను టచ్ చేస్తున్నారు. తలుపుతట్టి మరి ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని చెప్పటానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నిచోట్ల నిరసనలు..కొన్ని చోట్ల పొగడ్తలతో రకరకాల అభిప్రాయల సేకరణతో గడప గడప కార్యక్రమం జరుగుతోంది. కొంతమంది ఎమ్మెల్యేలు గడప గడపకు కార్యక్రమానికి దూరంగా ఉన్నప్పటికి, సీఎం జగన్ వద్దకు రిపోర్ట్ లు వెళుతున్న క్రమంలో అందరూ ఎప్పుడో ఒకప్పుడు గడప గడప కార్యక్రమంలో పాల్గొంటున్నారు. సీఎంకు అందుతున్న రిపోర్ట్ లపై పార్టీ వర్గాల్లో ప్రత్యేకంగా చర్చ జరుగుతోంది. పార్టీని ప్రభుత్వాన్ని కలుపుకొని ముందుకువెళితేనే వచ్చే ఎన్నికల్లో అనుకున్న స్థాయిలో విజయం సాధించవచ్చున్నది జగన్ అభిప్రాయం. అందులో భాగంగానే 175 సీట్ల టార్గెట్ ను జగన్ ప్రకటించారు. అదే టార్గెట్ ను ఎమ్మెల్యేలకు పెట్టి, విజయమే అంతిమంగా పని తీరు ఉండాలన్న స్పష్టమయిన లక్ష్యాన్ని నిర్దేశించారు. దీంతో ఎమ్మెల్యేలు అంతా తప్పనిసరిగా గడప గడపలో పాల్గొనక తప్పలేదు. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంపై జగన్ ఇప్పటికే సమావేశం నిర్వహించారు. తాడేపల్లి లోని సీఎం క్యాంప్ కార్యాలయం వేదికగా 175 నియోజకవర్గాల్లోని ఇంఛార్జ్ లు, ఎమ్మెల్యేలతో జగన్ సమావేశం అయ్యారు. అదే సమావేశంలో ఎమ్మెల్యేలు గడప.. గడపకు ప్రభుత్వం జరుగుతున్న తీరుపై జగన్ సమీక్షించారు. ఒక్కో ఎమ్మెల్యే రోజులో ఎన్ని గంటలు, గడప గడప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు, ప్రజలకు దూరంగా ఎన్ని రోజులు ఉన్నారు, అనే విషయాలను జగన్ ప్రతి ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఎమ్మెల్యేలు ఆశ్చర్యానికి గురయ్యారు. గడప.. గడప పేరుతో మెక్కుబడిగా ప్రజల్లోకి వెళ్ళి మార్నింగ్ వాక్ తరహాలో నడుచుకుంటూ వెళ్ళిపోతున్న ఎమ్మెల్యలు ఎవరనే విషయాలను కూడా జగన్ నవ్వుతూనే అదే సమావేశంలో తెలియజేశారు. దాదాపుగా 27మంది ఎమ్మెల్యే లపై జగన్ బహిరంగంగానే అసహనం వ్యక్తం చేశారు. అందులో రోజా, కొడాలి నానితో పాటుగా ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర లాంటి నేతలు ఉండటం కొసమెరుపు. ఇక మరోసారి అత్యంత కీలకమయిన ఈ సమావేశాన్ని వచ్చే వారంలో నిర్వహించేందుకు జగన్ రెడీ అవుతున్నారు. త్వరలో సీఎం జగన్ ఎమ్మెల్యేలతో కీలక సమీక్షా సమావేశం నిర్వహింస్తారని పార్టీ వర్గాల నుంచి సమాచారం బయటకు వచ్చింది. ఈ సమీక్షలో ఎమ్మెల్యేల తాజా పరిస్థితిని మరో సారి జగన్ స్వయంగా సమీక్షిస్తారు. ఏ ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది.. ఎవరికి టికెట్లు.. ఎవరికి ఇక్కట్లు అనే దాని పై ఒక క్లారిటీ వచ్చే అవకాశం ఉందని పార్టిలో ఇప్పటికే ప్రచారం మెదలైంది. సీఎం ఇప్పటికే కొంత మంది ఎమ్మెల్యేల పనితీరు విషయంలో కొంత అసంతృప్తితో ఉన్నారు. ఈసారి ఎమ్మెల్యేలకు గడప గడపకు కార్యక్రమానికి పెద్దగా టైం కూడా ఇవ్వకపోవచ్చని చెబుతున్నారు. ఎందుకంటే 2023 లో అంతా ఎన్నికల మూడ్ ఉంటుంది. వచ్చే బడ్జెట్ సమావేశాల తర్వాత నుంచి ఇక ఎన్నికలపైనే ప్రధానంగా దృష్టి పెట్టే అవకాశం ఉండడంతో ఈ నెలలో ఎమ్మెల్యేలతో జరిగే సమావేశం కీలకం కానుందని పార్టీ నేతలు భావిస్తున్నారు. దీంతో ఆశావహులు కూడా ఇప్పటికే పార్టీ కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు మెదలుపెట్టారని అంటున్నారు.

# ఢిల్లీ చేరుకున్న తెదేపా అధినేత చంద్రబాబు

ఢిల్లీ: రెండు రోజుల పర్యటన నిమిత్తం తెదేపా అధినేత చంద్రబాబు ఢిల్లీ చేరుకున్నారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు తెదేపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. త్వరలో పార్లమెంట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో పార్టీ ఎంపీలు అనుసరించాల్సిన వ్యూహం, లేవనెత్తిన అంశాలపై చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ప్రధాని మోదీ నేతృత్వంలో జీ20 సదస్సు నిర్వహణపై జరిగే అఖిలక్ష భేటీకి ఆయన హాజరుకానున్నారు. ఏపీ సీఎం జగన్ కూడా ఈ



సమావేశంలో పాల్గొననున్నారు. తాడేపల్లిలోని తన నివాసం నుంచి ఆయన ఢిల్లీకి బయల్దేరారు.

# జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఆ ప్రచారంలో వాస్తవం లేదు: సజ్జల

అమరావతి: ఏపీ ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తుందనడంలో వాస్తవం లేదని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. పంచాయతీరాజ్ విభాగంలో ఉద్యోగులను తొలగిస్తూ ఆదేశాలిచ్చారని.. దీనిపై సీఎం జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారని చెప్పారు. అమరావతిలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపును ఉపసంహరించుకోవాలని సీఎం ఆదేశించారని సజ్జల చెప్పారు. పంచాయతీరాజ్ విభాగంలో ఉద్యోగులను తొలగించడంపై విచారణ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో మూడు రాజధానులు రావడం ఖాయమని ఈ సందర్భంగా సజ్జల పునరుద్ఘాటించారు.



# సంపాదకీయం

మంగళవారం 06-12-2022

## ఎన్నికలలో రాజకీయ పార్టీల బాండ్లు

పెట్టుబడుల గురించి తెలుసిన వారికి బాండ్స్ గురించే తెలిసే ఉంటుంది. ఆర్థిక మాంద్యం వంటి సమయంలో చాలా మంది తమ పెట్టుబడులను ఈక్విటీ నుంచి డెట్ అంటే బాండ్స్ లోకి మారుతుంటారు. ఇందులో రకరకాల బాండ్స్ ఉన్నప్పటికీ.. ఇప్పుడు మనం ఎలక్టోరల్ బాండ్స్ అందుబాటులోకి వచ్చాయి. వీటి పనితీరు వేరేగా ఉంటుంది. ఎన్నికల బాండ్ల పథకం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకూ జరిగిన అమ్మకాల్లో అత్యధికం ముంబయి నుంచి జరిగాయని ఎస్‌బిఐ వెల్లడించింది. ముంబయి తర్వాత బాండ్ల అమ్మకాలు ఎక్కువగా కోల్‌కతా, హైదరాబాద్, న్యూఢిల్లీ, చెన్నై నగరాల్లో చోటుచేసుకున్నాయని, ఈ ఐదు నగరాల నుంచి బాండ్ల పథకం ద్వారా రూ. 10,791 కోట్ల విరాళాలు సమకూరినట్టు ఎస్‌బిఐ తెలిపింది. ఇందులోని 62 శాతం మొత్తం న్యూఢిల్లీలోని ఎస్‌బిఐ ప్రధాన శాఖ నుంచి ఆయా రాజకీయ పార్టీలు నగదుగా మార్చుకున్నాయి. సామాజిక కార్యకర్త లోకేశ్ బాత్రా దాఖలు చేసిన ఆర్‌టిఐ దరఖాస్తుకు ఎస్‌బిఐపై గణాంకాలు విడుదల చేసింది. దీనికి సంబంధించి మరికొన్ని వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అమ్ముడైన బాండ్లలో 65శాతం ముంబయి, కోల్‌కతా, హైదరాబాద్ ఎస్‌బిఐ బ్రాంచ్‌ల వద్ద నుంచి ఉన్నాయి. ఎలక్టోరల్ బాండ్ల 24వ విడత జారీకి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 12వ తేదీ వరకు బాండ్లు అమ్మకానికి అందుబాటులో ఉంటాయని తెలిపింది. బాండ్ల విక్రయం ప్రారంభం కానున్న సోమవారమే గుజరాత్ అసెంబ్లీ రెండో దశ పోలింగ్ జరుగనున్నది. ఎస్బీఐ దేశవ్యాప్తంగా 29 బ్రాంచ్‌ల ద్వారా ఈ బాండ్ల అమ్మకం చేపడుతుందని కేంద్ర ఆర్థిక శాఖ ఒక ప్రకటనలో పేర్కొన్నది. దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వడానికి ఎలక్టోరల్ బాండ్లను జారీ చేస్తారు. మీరు కూడా ఎలక్టోరల్ బాండ్ల ద్వారా విరాళం ఇవ్వాలనుకుంటే.. మీకు ఇది ఓ పెద్ద వార్త అని చెప్పవచ్చు . 24వ విడత ఎలక్టోరల్ బాండ్ల జారీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ విషయంపై సమాచారం ఇస్తూ, 24వ విడత ఎలక్టోరల్ బాండ్ల కొనుగోలు ప్రారంభమవుతుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. అదే సమయంలో, కస్టమర్లు 12 డిసెంబర్ 2022 వరకు స్టేట్ బ్యాంక్ బ్రాంచ్ నుంచి కొనుగోలు చేయగలుగుతారు. ఇంతకు ముందు ఇటీవల, 23వ విడత ఎలక్టోరల్ బాండ్లు 2022 నవంబర్ 9 నుంచి 15 వరకు ప్రారంభమయ్యాయి. అటువంటి సమయంలో మీరు 24వ వాయిదాలో డబ్బును పెట్టుబడి పెట్టాలనుకుంటే ఇది మీకు సువర్ణావకాశం. ఎలక్టోరల్ బాండ్లను విక్రయించడానికి ప్రభుత్వం స్టేట్ బ్యాంక్‌కు అధికారం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ బాండ్‌ను స్టేట్ బ్యాంక్ సిమ్లా, డెహ్రాడూన్, కోల్‌కతా, లక్నో, న్యూఢిల్లీ, చండీగఢ్, శ్రీనగర్, గాంధీనగర్, గౌహతి, గాంధీనగర్, భోపాల్, రాయ్‌పూర్, ముంబై, చెన్నై, పాట్నాతో సహా మొత్తం 29 నగరాల్లోని ౹ాఃఎ శాఖ నుంచి కొనుగోలు చేయవచ్చు. బాండ్ చెల్లుబాటు మొత్తం 15 రోజులు కావడం గమనార్హం. గడువు తేదీ ముగిసిన తర్వాత మీరు బాండ్‌ను బ్యాంకులో డిపాజిట్ చేస్తే, రాజకీయ పార్టీలకు దాని మొత్తం లభించదు. దీనితో పాటు, గత లోక్‌సభ లేదా రాష్ట్ర ఎన్నికలలో మొత్తం ఓట్లలో 1 శాతం వరకు పొందగలిగిన తమ ఎలక్టోరల్ బాండ్లను ఆ రాజకీయ పార్టీలు మాత్రమే జారీ చేయగలవు. ఈ బాండ్ ద్వారా వెండిని సేకరించగలుగుతుంది. 2018 సంవత్సరంలో మోడీ ప్రభుత్వం మొదటిసారిగా రాజకీయ పార్టీలకు నిధుల సేకరణ కోసం ఎలక్టోరల్ లేదా ఎలక్టోరల్ బాండ్లను జారీ చేయడం ప్రారంభించింది. రాజకీయ పార్టీలకు విరాళాల నిధుల విషయంలో పారదర్శకత తీసుకురావడమే మోదీ ప్రభుత్వం ఈ బాండ్‌ను తీసుకురావడం వెనుక ఉద్దేశం. ఏదైనా వ్యక్తి, సంస్థ లేదా కార్పొరేట్ వ్యవస్థ ఈ బాండ్‌ను కొనుగోలు చేయవచ్చు. రాజకీయ సంస్థ బ్యాంకుకు వెళ్లి ఈ బాండ్ చెల్లించి డబ్బు తీసుకోవచ్చు. బ్యాంకులు ఈ ఎలక్టోరల్ బాండ్లను ఐజఅ ధృవీకరించబడిన వినియోగదారులకు మాత్రమే విక్రయిస్తాయని గమనించాలి. బాండ్ ద్వారా దాత పేరు గోప్యంగా ఉంచబడుతుంది. రూ. 1000, 10,000, 1,00,000, 10,00,000, 1,00,00,000 డినామినేషన్లలో ఈ బాండ్ల అమ్మకం ఉంటుంది. సాధారణంగా ఈ బాండ్లు జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో 10 రోజుల పాటు అందుబాటులో ఉంటాయి. అదే సార్వత్రిక ఎన్నికల సమయంలో కేంద్ర ప్రభుత్వం అదనంగా 30 రోజులు అనుమతినిస్తుంది. విదేశాల్లో రాజకీయ పార్టీలు ఎలాంటి విరాళాలు స్వీకరించకూడదనే పరిమితి కూడా ఉంది. దేశవ్యాప్తంగా రాష్ట్ర రాజధానులు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ముఖ్య నగరాల్లోని ఎస్‌బిఐ శాఖల వద్ద మాత్రమే ఈ బాండ్ల అమ్మకాల్ని కేంద్రం చేపట్టింది. 17 శాఖల నుంచి రూ. 10,791 కోట్లు వసూలయ్యాయని నవంబర్ 23న విడుదల చేసిన సమాచారంలో ఎస్‌బిఐ తెలిపింది. ముంబయి నుంచి రూ. 2742.12 కోట్లు, న్యూఢిల్లీలో రూ. 1519 కోట్లు, కోల్‌కతాలో రూ. 2387.71 కోట్లు, హైదరాబాద్‌లో రూ. 1885.35 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లు అమ్ముడయ్యాయి. న్యూఢిల్లీ బ్రాంచ్‌లో బాండ్లను నగదుగా మార్చుకున్న మొత్తం రూ. 6748.97 కోట్లు. హైదరాబాద్‌లో రూ. 1384 కోట్లు, కోల్‌కతాలో రూ. 1012.98 కోట్ల విలువైన బాండ్లను రాజకీయ పార్టీలు నగదు రూపంలో మార్చుకున్నాయి. ఈ ఏడాది నవంబర్ 9 నుంచి నవంబర్ 15 వరకు కేంద్రం 23వ విడత బాండ్లను విక్రయాన్ని చేపట్టడం సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.

# 3 రాజధానులు... ముందుకు..వెనక్కి

విశాఖపట్టణం, డిసెంబర్ 5, ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. సంక్షేమం విషయంలో స్పీడ్ గానే ఉన్న జగన్ కీలక విషయాల్లో మాత్రం జనాలను మరింత దగ్గరకు చేర్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లో మూడు రాజధానులుగా ప్రతిపాదన తెస్తూ రెండేళ్లు దాటి పోయింది. అయితే ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇందుకు న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయని వైసీపీ చెప్పుకోవచ్చు. పరిపాలన రాజధాని విశాఖకు, న్యాయరాజధానిని కర్నూలుకు, శాసన రాజధానిని అమరావతిలో కొనసాగించాలని జగన్ ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. అయితే న్యాయపరమైన చిక్కులు ఎదురుకావడంతో ఆమోదించిన బిల్లులను కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మళ్లీ బిల్లులను బలంగా రూపొందించి తీసుకువస్తామని అసెంబ్లీలో చెప్పారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో కేసు నడుస్తోంది. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తమకు అనుకూలమని వైసీపీ, లేదు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిందని విపక్షాలు ఎవరికి వారు చెప్పుకున్నాయి. న్యాయరాజధానిని కర్నూలుకు తరలించాలంటే అది జగన్ చేతిలో లేదు. హైకోర్టు న్యాయమూర్తులు, రాష్ట్ర ప్రభుత్వం కూర్చుని కలసి చర్చించుకుని ఒక ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వానికి పంపాలి. అప్పుడే అది కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుంది. కర్నూలుకు న్యాయ రాజధానిని తరలించాలంటే రాష్ట్రపతి మళ్లీ నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంటుంది. అయితే ఇది సాధ్యమవుతుందా? లేదా? అన్నది ఎవరూ చెప్పలేం. ఎందుకంటే కర్నూలులో హైకోర్టుకు బీజేపీ సుముఖమే. అలాగని ఎన్నికలకు ముందు ఆ పార్టీ వైసీపీకి ఆ ఛాన్స్ ఇస్తుందా? లేదా? అన్నది సందేహమే.. దీనికి ప్రత్యామ్నాయంగా విశాఖలో, విజయవాడలో హైకోర్టు బెంచ్ లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది. ఆ దిశగా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. న్యాయరాజధాని విషయంలో మాత్రం ఎన్నికలు ముగిసే వరకూ ఒక కన్‌క్లూజన్ కు వచ్చే అవకాశాలు అయితే తక్కువేనని చెప్పాలి. అందుకే డిసెంబరు 5వ తేదీన వైసీపీ కర్నూలులో న్యాయ రాజధానిని డిమాండ్ చేస్తూ ఏకంగా భారీ సభను ఏర్పాటు చేస్తుందని కూడా అనుకోవాల్సి ఉంటుంది. ఇక శాసన రాజధాని విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేవు. అమరావతిలోనే అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలు నిర్వహిస్తారు కనుక దానికి ఏ ఆటంకాలు ఉండవు. ఇక మిగిలింది పరిపాలన రాజధాని మాత్రమే. విశాఖకు పరిపాలన రాజధానిని అధికారికంగా తీసుకుని వెళ్లాలన్నా ప్రభుత్వం మరోసారి కొత్త బిల్లును

చట్టసభల్లో పెట్టి ఆమోదించాలి. సుప్రీంకోర్టులో ఎలాంటి తీర్పు వస్తుందో చెప్పలేం. ఊహించలేం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వస్తే దీనిని కూడా ఎన్నికలు పూర్తయ్యేంత వరకూ జగన్ విశాఖకు తరలించలేని పరిస్థితి. అందుకే జగన్ వచ్చే ఏడాది ఏప్రిల్ నెల నుంచి పరిపాలనను విశాఖ నుంచి చేయాలని చూస్తున్నారు. సీఎం జగన్ అక్కడకు వెళ్లి వారానికి మూడు రోజులు అక్కడి నుంచి పాలన సాగించాలని చూస్తున్నారట. దానికి ఎవరికీ అభ్యంతరం ఉండదు. న్యాయపరమైన చిక్కులు కూడా ఎదురుకావు. ముఖ్యమంత్రి పాలనను విశాఖ నుంచి ప్రారంభించారన్న సంకేతాలను మాత్రం పంపే వీలుంటుంది. కానీ ఉద్యోగులను తరలించడానికి సాధ్యం కాదని చెబుతున్నారు. కేవలం సీఎం క్యాంప్ కార్యాలయాన్ని విశాఖలో ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచి వారానికి కొన్ని రోజులు అక్కడి నుంచి పాలన చేయాలని చూస్తున్నారట. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# ఎన్నికలకు సిద్ధం అంటున్న టీడీపీ, వైసీపీ....



నెల్లూరు, డిసెంబర్ 5, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు డైనమిక్‌గా మారిపోతున్నాయి. వాస్తవంగా ఎన్నికలుకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉంది. కానీ అన్ని రాజకీయ పార్టీలు వచ్చే నెల్లోనే ఎన్నికలన్నంతగా హడావుడి పడుతున్నాయి. అధినేతలు ప్రజల మధ్యకు వెళ్తున్నారు. అభ్యర్థులను ఖరారు చేస్తున్నారు. ఒకటికి మూడు సంస్థలతో సర్వేలు చేయించుకుంటున్నారు. అధికార వైఎస్ఆర్‌సీపీ, తెలుగుదేశం ఈ విషయంలో ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు. కానీ మరో ప్రధాన పార్టీ జనసేన మాత్రం పవన్ కల్యాణ్ ఏపీకి వచ్చినప్పుడు మాత్రమే హైలెట్ అవుతూ ఉంటుంది. మిగతా సందర్భాల్లో సైలెంట్ గా ఉంటుంది. దీంతో ఆ పార్టీ వెనుకబడిపోతోందన్న అభిప్రాయం వినిపించడానికి కారణం అవుతోంది. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీ రాజకీయాలపై తక్కువగా ఫోకస్ చేస్తుంది. ఎందుకంటే ప్రజలు ఓటు వేసేటప్పుడు ప్రభుత్వం కొనసాగాలా.. మార్పు కావాలా అన్న ఉద్దేశంతోనే ఓట్లు వేస్తారు. అందుకే అధికారంలో ఉన్న పార్టీలు మెరుగైన పాలన అందించి ప్రజల నుంచి మరో అవకాశాన్ని పొందడానికి ప్రయత్నిస్తాయి. కానీ సీఎం జగన్ మాత్రం రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏడాది కిందటి నుంచి ఆయన వచ్చే ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక.. ప్రచారం తరహా కార్యక్రమాలు ప్రారంభించేశారు. గడప గడపకూ మన ప్రభుత్వంపేరుతో ఓ రకంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. అదే సమయంలో అభ్యర్థుల ఎంపికపైనా ఓ అవగాహనకు వచ్చారని.. చెబుతున్నారు. వ్యతిరేకత ఎక్కువ ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలను పక్కన పెట్టి కొత్త వారిని కూడా ఖరారు చేసుకున్నారు. అయితే బయట పెట్టడం లేదు. కానీ అంతర్గతంగా సంకేతాలు వెళ్లిపోతున్నాయి. ఓ రకంగా ఎన్నికల సన్నద్ధతను జగన్ దాదాపుగా పూర్తి చేశారని అనుకోవచ్చు. ఇప్పుడు ఆయన జిల్లాల పర్యటనలో ఉన్నారు. జగన్ సన్నద్ధత జోరు చూసి ముందస్తు ఎన్నికలు ఉంటాయేమోనని ఎక్కువగా భావిస్తున్నారు. టీడీపీ బాదుడే బాదుడు అని చేస్తూనే... కొత్తగా ఇదేం ఖర్మ రాష్ట్రానికి అని పర్యటనలు ప్రారంభించారు. లోకేష్ తన పాదయాత్రకు విస్తృతంగా సన్నాహాలు చేసుకుంటున్నారు. ఆ పార్టీ వ్యవస్థలు మొత్తం యాక్టివ్ అయిపోయాయి. తాడో పేడో అన్నట్లుగా పోరాటం ప్రారంభించాయి. ప్రతీ నియోజకవర్గంలో ఇంచార్జులకు టిక్కెట్లపై చంద్రబాబు క్లారిటీ ఇచ్చారు. ఖచ్చితంగా గెలిచే చాన్స్‌ఉన్న వంద సీట్లపై ప్రధానంగా దృష్టి పెట్టి ముందుగానే అభ్యర్థుల్ని కూడా ఖరారు చేసి ఎవరూ ఊహించని రాజకీయ వ్యూహాలు అమలు చేస్తున్నారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికలు ఇప్పటికిప్పుడు వచ్చినా తక్షణం 175 నియోజకవర్గాల్లో అభ్యర్థుల్ని ప్రకటించి.. ప్రచారానికి వెళ్లిపోయేలా చంద్రబాబు కసరత్తు పూర్తయిందని అంటున్నారు. టీడీపీ కూడా పలు రకాల సర్వేలు చేయించుకుంటోంది. రాబిన్ శర్మ అనే స్ట్రాటజిస్ట్ ఆ పార్టీకి పని చేస్తున్నారు. పవన్ కల్యాణ్ వారాంతాల్లో ఏపీకి వస్తున్నారు. వైసీపీ ఎలా గెలుస్తుందో చూస్తామని ప్రకటిస్తున్నారు. ఒక్క చాన్సివ్వాలని అడుగుతున్నారు. అంతా బాగానే ఉంటుంది కానీ..ఈ హడావుడి అంతా ఆయన ఏపీలో పర్యటించినప్పుడే . తర్వాత మళ్లీ మామూలే. అక్కడక్కడ నాదెండ్ల మనోహర్ పర్యటిస్తున్నప్పటికీ.. కొద్దిమంది పార్టీ క్యాడర్ పాల్గొనే సమావేశాలు.. తప్ప ప్రజల్ని ఎంగేజ్ చేసే ప్రోగ్రాములేమీ ఉండటం లేదు. జనసేనకు ప్రత్యేకంగా స్ట్రాటజిస్ట్ కూడా లేరు. ఇక అభ్యర్థుల ఎంపికపై కసరత్తు .. నియోజకవర్గాల సమీక్షల ఊసే లేదు. గతంలో సమీక్షలు చేస్తామని పవన్ కల్యాణ్ ప్రకటించారు కానీ..చేస్తున్న దాఖలాలు కనిపించలేదు. పవన్ కల్యాణ్‌కు ఫ్యాన్స్ ఉన్నారు కానీ..జనసేనకు నేతల కొరత ఉంది. పార్టీ వాయిస్ బలంగా వినిపించే కొంత మంది నియోజకవర్గాల్లో పట్టు పెంచుకునేందుకు ప్రయత్నించడం లేదు. దీంతో నాయకుల కొరత వెంటాడుతోంది. జనరవరి నుంచి పవన్ కల్యాణ్ బస్సు యాత్ర చేస్తారని చెబుతున్నారు. ఆ యాత్ర నిరాటంకంగా సాగుతుందన్న గ్యారంటీ లేదు. ఒక వేళ సాగినా ప్రజల్లో ఉండటానికి పనికొస్తుంది కానీ..రాజకీయం అంటే.. అదొక్కటే కాదు. అందుకే జనసేనానికి టీడీపీ, వైఎస్ఆర్‌సీపీలతో పోలిస్తే వెనుకబడిపోయిందన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇప్పటికే మరీ సమయం మించి పోలేదు. ఎన్నికలుక ఏడాదిన్నర సమయం ఉంది. కానీ ముందస్తు ఎన్నికలు వస్తే మాత్రం ఆ రెండు పార్టీలు పోరాటానికిరెడీగా ఉన్నాయి. అప్పుడు జనసేన ఇబ్బంది పడుతుంది.

# జగన్..పవన్ మధ్యలో ఆలీ



గుంటూరు, డిసెంబర్ 5, రాజకీయాలకు ఉండే 'పవరే' అలాంటిది..మంచి మిత్రులనే కాదు, భార్యా భర్తలను, తండ్రీ కొడుకులను, అన్నదమ్ములను,అక్క చెల్లెళ్ళను, వారినీ వీరిని అని ఏముంది, చివరకు అవిభక్త కవలలను సైతం విడదీయగల మహమ్మారి రాజకీయం. సినిమా ఇండస్ట్రీతో ఏ కొంచెం పరిచయం ఉన్న ఎవరికైనా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కమెడియన్ ఆలీ మధ్య ఉన్న స్నేహం గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం ఉండదు. అలీ పవన్ ప్రాణమిత్రులు, జిగ్నీ దోస్తులు అన్నా కొలత సరిపోదు. బియాండ్ దట్ అంతకంటే ఎక్కువైనది ఆ ఇద్దరి స్నేహం అంటారు, సినిమా రంగంలోని ఆ ఇద్దరి మిత్రుల మిత్రులు. 'తొలి ప్రేమ' మొదలు 'కాటం రాయుడు' వరకు పవన్ కళ్యాణ్ ప్రతి సినిమాలోనూ స్టోరీ డిమాండ్ చేసినా చేయక పోయినా, 'అలీ' కి ఓ పాత్ర ఉంటుంది. అదొక, 'రాజ్యాంగ' నిబంధన. అందుకే, కథకు అవసరం ఉన్నా లేకున్నా, అలీ కోసం ఓ పాత్రను సృష్టించిన దర్శకులు ఉన్నారు. ఇక్కడ అప్రస్తుతమేమో కానీ, అలాంటి జోడీ ఇంకొకటి కూడా వుంది. దర్శకుడు తివిక్రం శ్రీనివాస్ ప్రతి సినిమాలోనూ, హాస్య నటుడు సునీల్ కు ఒక పాత్ర ఉటుంది. అది కష్టాల్లో ఒకే గదిలో కలిసున్న స్నేహానికి చిహ్నం అంటారు. కట్ చేస్తే ... ఈ మధ్య కమెడియన్ ఆలీ పెద్ద కూతురు ఫాతిమా వివాహం జరిగింది. ఆ వివాహానికి, మెగా స్టార్ చిరంజీవి సతీ సమేతంగా హాజరయ్యారు. నాగార్జున, అమల జంట వచ్చి అక్షింతలు వేశారు. ఇంకా చాలా మంది సినిమా పెద్దలు, చిన్నలు చాలా మంది పెళ్ళికి వెళ్లి అలీతో సరదాగా, సందడి చేశారు. కానీ పవన్ కళ్యాణ్ జంటగా కాదు కదా కనీసం ఒంటరిగా అయినా పెళ్ళికి వెళ్ళలేదు. అదేమిటి, అంత జిగ్నీ దోస్త్ కూతురు పెళ్ళికి పవన్ కళ్యాణ్ ఎందుకు వెళ్ళలేదు?ఈ ప్రశ్న పెళ్ళికి వెళ్ళిన వారినే కాదు, వెళ్లని వారినీ వెంటాడుతూనే వుంది. సోషల్ మీడియాలో అయితే అందుకే వెళ్ళలేదంటూ ఎన్నో కథలు. ఆ ఇద్దరి మధ్య రాజకీయమే చిచ్చు పెట్టిందని, చాలా చాలా కథలు షికార్లు చేస్తున్నాయి.ఒకరు, అసలు అలీ పిలవనే లేదంటే, ఇంకొందరు, అలీ పిలిచినా పవన్ కళ్యాణ్ వెళ్లలేదని అంటారు. ఏది నిజమో, ఏది రాజకీయమో... ఎవరికీ తెలియక పోవచ్చును. అలీ కొంచెం చాలా నింపాదిగా,పవన్ కళ్యాణ్ రాకపోవడానికి, అందరు అనుకుంటున్నట్లుగా రాజకియ విభేదాలు కారణం కాదు అని ఒక వివరణ ఇచ్చారు. చివరి నిమిషంలో ఫ్లైట్ మిస్ అవ్వడం వలన చేతనే పవన్ కళ్యాణ్ పెళ్లికి హాజరు కాలేకపోయారని, అలీ వివరణ ఇచ్చారు. అలాగే, ఎప్పుడైనా కూతురు, అల్లుడు ఇంట్లోనే ఉంటే చెప్పు.. అప్పుడు వస్తాను అని అన్నారనీ, అన్నారు. అయితే, అయన ఇచ్చిన వివరణ నమ్మేటట్టు లేదని సోషల్ మీడియాలో కొత్త కథలు పుట్టుకొస్తున్నాయి. సరే, పెళ్లికి రావడానికి ఫ్లైట్ మిస్ కథ చెప్పారు బాగుది. పోనీ అదే నిజం అనుకున్నా, పెళ్లి తర్వాత గుంటూరులో ఘనంగా రిసెప్షన్ ఏర్పాటు చేశారు కదా.. ఆ వేడుకకు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి సహా.. చాలా మంది రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు,కదా .. మరి రిసెప్షన్ కు అయినా పవన్ కళ్యాణ్ ఎందుకు రాలేదు? అంటూ లా పాయింట్స్ లాగే వాళ్ళు లాగుతూనే ఉన్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే వేడుకలో, పవన్ కళ్యాణ్ ఎందుకని ఆలీ ఆయన్ని పెళ్ళికి మాత్రమే పిలిచి రిసెప్షన్కు పిలవ లేదా? ముఖ్యమంత్రి పాల్గొనే వేడుకలో తాను పాల్గొనడం ఎందుకని, పవన్ కళ్యాణ్ వెళ్ళలేదా? అంటూ కొత్త ప్రశ్నలు పుట్టుకొస్తున్నాయి. ఈ ప్రశ్నలకు ఆలీ, ఎప్పుడో తీరిగ్గా సమాధానం ఇస్తే, ఇవ్వవచ్చును. ఇవ్వక పోతే ఇవ్వక పోనూవచ్చును. ఇచ్చిన ఐవ్వక పోయిన భేతాళ ప్రశ్న మాత్రం ఎప్పటికీ చెరిగి పోదు. చెట్టెక్కదు. అయితే అలీ ఇంట పెళ్ళికి పవన్ కళ్యాణ్ ఎందుకు వెళ్ళ లేదనే చర్చకు చుక్కపెట్టి, అయన చెప్పిందే నిజం అని అనుకున్నా,రాజకీయాలు స్నేహ సంబంధాలనే కాదు,రక్త సంబంధాలను రక్తసిక్తం చేస్తాయి అనేది, నిజం. అందులోను జగన్ రెడ్డితో వ్యవహారం అంటే ఇక వేరే చెప్పనక్కరలేదు. జగన్ రెడ్డి సొంత బాబాయ్ వివేకానంద రెడ్డి మర్డర్ కేసులో ఏమి జరుగుతోందో చూస్తున్నాం. వివేకానంద రెడ్డి కుమార్తె, ఇతర బంధువులు జగన్ రెడ్డి ప్రభుత్వం పట్ల విశ్వాసం లేక కేసు విచారణను, పొరుగు రాష్ట్రానికి బదిలీచేయాలని సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సుప్రీం కోర్టు వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తును ఏపీ నుంచి తెలంగాణకు బదిలీ చేస్తూ ఈ మధ్యనే తీర్పు నిచ్చింది. ఇక ఒకే తల్లి రక్తం పంచుకు పుట్టిన సొంత సోదరి వైఎస్ షర్మిల విషయంలో ఏమి జరుగుతోందో కూడా చూస్తూనే ఉన్నాం. పొరుగు రాష్ట్రం తెలంగాణలో అక్కడి ప్రభుత్వం ఆమెను అరెస్ట్ చేసి, వేధింపులకు గురిచేస్తున్నా, జగన్ రెడ్డిలో చలనం లేదు. చెల్లినే కాదు, తల్లినీ తెలంగాణ పోలీసులు హౌస్ అరెస్ట్ చేసి కాలు కదల కుండా కట్టిపడేసినా జగన్ రెడ్డి పట్టించుకోలేదు. సో .. ఆలీ చెప్పినా చెప్పక పొయినా, పవన్ ? అలీ మధ్య అడ్డుగోడగా నిలిచింది ఎవరో కాదు. రాజకీయమే. అందుకే ..రాక్షసీ నీ పేరు రాజకీయమా ? అన్నారు, హాస్య రచయిత ఆదివిష్ణు. అవును అని చూపించారు హాస్య నటుడు అలీ .. అదీ విషయం.

# స్కిల్ డెవలప్మెంట్ స్కాంపై ఈడీ ఫోకస్

విజయవాడ, డిసెంబర్ 5,ఏపీ స్కిల్ డెవలప్మెంట్ స్కాంపై ఈడీ ఫోకస్ పెట్టింది. 2014- 19 మధ్య కాలంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లో భారీ అక్రమాలు జరిగినట్టు ఈడీ గుర్తించింది. స్కాంలో నిందితులుగా ఉన్న 26 మందికి ఈడీ నోటీసులు ఇచ్చింది. రూ. 234 కోట్ల నిధులు దారి మళ్లించినట్లు ఈడీ భావిస్తుంది. స్కిల్ డెవలప్మెంట్ మాజీ ఛైర్మన్ గంటా సుబ్బారావు, డైరెక్టర్ లక్ష్మీ నారాయణ, ఓఎస్డీ కృష్ణ ప్రసాద్ లకు ఈడీ తాజాగా నోటీసులు జారీ చేసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంపై ఈడీ వేగంపెంచింది. ఈ కేసులో నిందితులకు ఉన్న 26 మందికి నోటీసులు జారీ చేశారు. ఇందులో మొత్తం రూ. 234 కోట్ల నిధుల మళ్లింపుపై ఈడీ కేసు నమోదు చేసింది. పూణెకి చెందిన పలు కంపెనీల ద్వారా నిధులు మళ్లించినట్లు ఈడీ భావిస్తుంది. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గంటా సుబ్బారావుతో పాటు మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణకు ఈ కేసులో ఈడీ నోటీసులు ఇచ్చింది. వీరితోపాటు ఓఎస్‌డీ నిమ్మగడ్డ కృష్ణ ప్రసాద్ కు నోటీసులు ఇచ్చింది. హైదరాబాదులోని ఈడీ ఆఫీసులో విచారణకు హాజరు కావాలని నోటీసులో తెలిపింది. ఈ కేసులో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ ఎండీ, సీఈవో గంటా సుబ్బారావు, డైరెక్టర్ కె. లక్ష్మీనారాయణలతో పాటు 26 మందిపై సీఐడీ గతంలో కేసు నమోదు చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణను సీఐడీ అధికారులు విచారించారు. లక్ష్మీనారాయణ గతంలో చంద్రబాబుకు ఓఎస్డీగా పనిచేశారు. పదవీ విరమణ తర్వాత ఏపీ ప్రభుత్వానికి లక్ష్మీనారాయణ సలహాదారుగా పనిచేశారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు మొదటి డైరెక్టర్‌గా లక్ష్మీ నారాయణ పనిచేశారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు ట్రైనింగ్ ఇచ్చారు. ఈ క్రమంలో ట్రైనింగ్ సెంటర్లలో అవినీతి జరిగిందనే ఆరోపణలపై లక్ష్మీనారాయణ ఇంట్లో సీఐడీ సోదాలకు కూడా చేశారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకు సంబంధించిన రిమాండ్ రిపోర్ట్‌లో సీఐడీ కీలక విషయాలు నమోదు చేసింది. 2015 జూన్‌లో స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లో ఆర్థికలావాదేవీల్లో అవకతవకలు జరిగాయని గుర్తించింది. జీవో నెంబర్ 4 ప్రకారం సీమెన్స్ ఎండీ సౌమ్యాద్రి శేఖర్ బోస్, డిజైన్ టెక్ ఎండీ వికాస్ కన్విల్కర్‌కు గత ప్రభుత్వం రూ. 241 కోట్లు కేటాయించిందని తెలిపింది. ఉద్దేశపూర్వకంగా ఈ సొమ్ము అప్పగించిందని వెల్లడించింది. ఈ సొమ్మును 7 షెల్ కంపెనీలకు తప్పుడు ఇన్‌వాయిస్‌లు సృష్టించినట్టు తరలించారని తెలిపింది. ఈ ప్రాజెక్టు వ్యయాన్ని టెక్నాలజీ కంపెనీలు, ప్రభుత్వానికి విభజించడంలో అవకతవకలు జరిగాయని సీఐడీ పేర్కొంది. 2017-18లో రూ. 371 కోట్లలలో.. రూ. 241 కోట్లు గోల్‌మాల్ జరిగాయని సీఐడీ రిమాండ్ రిపోర్ట్‌లో వెల్లడించింది.

# అబ్బ.. 3 వారాల పాటు ఫుల్ మ్యారేజెస్

గుంటూరు, డిసెంబర్ 5, మూడు నెలలుగా మూఢాల కారణంగా మూగబోయిన కల్యాణ వీణ మళ్లీ మోగుతోంది. ఎక్కడ చూసినా కల్యాణ కాంతులు ధగధగ లాడుతుండడంతో పాటు అటు కల్యాణ మండపాలు పెళ్లిళ్ల హడావిడితో కళకళ లాడుతున్నాయి. ఇటు ఊపందుకున్న పెళ్లిళ్ల సందడితో వ్యాపారాలు జోరందుకున్నాయి. కరోనా విపత్తు తరువాత మూడు నెలల క్రితం వరకు పెళ్లిళ్లు సందడిగానే జరగ్గా మళ్లీ మూఢం ముంచుకు రావడంతో పెళ్లిళ్లను చాలా మంది వాయిదా వేసుకున్నారు. మూఢం పోవడంతో పుణ్యక్షేత్రాల్లో వివాహ తంతును జరిపించుకోవాలని ఎదురు చూసిన పెళ్లి ఇంట ముహూర్తాలు కుదరడంతో అన్నవరం, వాడపల్లి, చిన్నితిరుపతి తదితర పుణ్యక్షేత్రాల్లో కళ్యాణ శోభ సంతరించుకుంది. మూడు నెలలుగా ముహూర్తాలు లేక పెళ్లిళ్లు వాయిదా వేసుకున్నవారు తాజాగా మూడు వారాల పాటు ఏకధాటిగా శుభముహూర్తాలు ఉండడంతో వివాహ వేడుకను అంగరంగ వైభవంగా జరిపించుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈనేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో వేలాదిగా వధూవరులు ఒక్కటవ్వబోతున్నారు. డిసెంబరు ఒకటో తేదీ నుంచి 18వ తేదీ వరకు మొత్తం పన్నెండు రోజుల పాటు బలమైన ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళు జోరందుకున్నాయి. సాధారణంగా అశ్వీయుజ, కార్తీక, మార్గశిర మాసాల్లో వివాహాలు ఎక్కువగా జరుగుతాయి.. కానీ మూఢం కారణంగా బ్రేక్ పడింది. మూడు నెలలుగా వెలవెలబోయిన కల్యాణ మండపాలన్నీ ప్రస్తుతం కళకళలాడుతున్నాయి. వస్త్ర దుకాణాలు, పూల దుకాణాలు, కిరాణా దుకాణాలన్నీ, బంగారం షాపులు, భాజాలు వాయిస్తూ బతికే వాళ్లు, అయ్యగార్లు.. ఇలా అందరూ ఈ వివాహల వల్ల ఉపాధి పొందుతారు. ఇన్నాళ్లూ పనులు లేక ఇబ్బందులు పడ్డ వాళ్లంతా వరుస శుభ ముహూర్తాలతో తెగ బిజీ అయిపోయారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా కల్యాణ మండపాలు కళకళలాడుతున్నాయి. ఇప్పటికే కల్యాణ మండపాలు, సత్రాలు, కన్వెన్షన్ హాళ్లు, చిన్నా చితకా పంక్షన్ హాళ్లు అన్నీ బుక్ అయిపోయాయి. చాలా మందికి కల్యాణ మండపాలు దొరక్క ఆలయాల్లోనే వివాహ తంతును కానిచ్చేసి ఇంటికి సమీప బహిరంగ ప్రాంతాల్లో రిసెప్షన్ వేడుకను ఘనంగా జరిపించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అదే విధంగా షామియానాలు, ఫ్లవర్ డెకరేషన్లు, బ్యాండు మేళాలు ఇలా అన్నీ ఇప్పటికే పురమాయించుకుంటున్నారు. వీటికి డిమాండ్ బాగా పెరిగిపోయింది. చాలా చోట్ల సమకూర్చలేమని చేతులెత్తేసే పరిస్థితి కనిపిస్తోంది. పెళ్లి అంటే జీవితంలో చేసుకునే అతిపెద్ద పండుగ. దాన్ని ఎవరూ అంత త్వరగా మరిచిపోలేరు. దాన్ని ఎంతో ఘనంగా జరిపించుకునేందుకు చాలా మంది ఎంత ఖర్చుకైనా వెనకాడని పరిస్థితి ఉంటుంది. క్రమంలోనే పెద్ద పెద్ద వస్త్ర దుకాణాలు మొదలుకుని బంగారు షాపులు, ఇతర వ్యాపారాలు పెళ్లింట వారి తాకిడికి కళకళలాడుతున్నాయి. మరో పక్క క్యాటరింగ్ సంస్థలు క్షణం తీరకలేకుండా పళ్లింట భోజనాలు సమకూర్చేందుకు తలమునకలైన పరిస్థితి కనిపిస్తోంది. ఏది ఏమైనా ఈ మూడు వారాల సమయంలో ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో సుమారు 20 వేలకు పైబడి వివాహాలు జరుగుతాయని అంచనా ఉంది.

## చెరకువాడ గ్రామంలో సామాజిక వెలి కలకలం

ఏలూరు పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం చెరకువాడ గ్రామంలో ఓ కుటుంబాన్ని వెలివేశారు అక్కడి గ్రామ సంఘ పెద్దలు. ఆ కుటుంబంతో ఎవరు మాట్లాడినా 5,000 రూపాయలు జరిమానా విధిస్తామని హుకూం జారీ చేయడంతో చెరుకువాడ లోని బాధితులు రాణి, సతీష్ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాణిని లోపరుచుకోవాలని చెరకువాడకు చెందిన ఓ గ్రామ పెద్ద కనకారావు రాణి, సతీష్ లను వేధించినట్లు సమాచారం. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడం తో గ్రామ పెద్దలు ఆ రెండు కుటుంబాల వారినీ కక్షగట్టి వెలివేశారు. వెలివేసిన ఈ ఘటనపై పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు సంఘ పెద్దలు కనకారావు, మధు మోహన్ రావు లపై కేసు నమోదు చేసారు.

# కార్మికులు భద్రత గా పని చేయాలి

## నో స్మోక్ జోన్ గా ద్వారకా తిరుమల



ఏలూరు, డిసెంబర్ 5,ఆంధ్రప్రదేశ్‌లో తిరుమల తర్వాత.. చిన్న తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ప్రాంతం ద్వారకా తిరుమల క్షేత్రం. శ్రీ వెంకటేశ్వరస్వామి కొలువై ఉన్న ఈ ఆలయానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. అధ్యాత్మిక కేంద్రం కావడంతో ఇక్కడికి వచ్చే భక్తులు మరింత ప్రశాంత వాతావరణంలో గడిపేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. తిరుమల తరహాలో ద్వారకా తిరుమల క్షేత్రంలో కూడా పొగతాగటంపై నిషేధం విధించాలని అధికారులు నిర్ణయించారు. ద్వారకాతిరుమలను స్మోక్ ఫ్రీ జోన్‌గా మార్చాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలు జారీచేశారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఆలయ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. దేవస్థానం కొండపైనా, కొండ కింద 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తుల వినియోగంపై అధికారులు నిషేధం విధించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి త్వరలో ఆలయ సిబ్బందికి 21 రోజులు పాటు శిక్షణ ఇవ్వనున్నారు. పొగాకు ఉత్పత్తుల వినియోగం, విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టనున్నారు. బహిరంగ ప్రదేశాలలో ధూమపాన నిషేధ చట్టంపై విస్తృతంగా ప్రచారం చేయనున్నారు. ముఖ్యంగా ధూమపాన నిషేధంపై భక్తుల్లో అవగాహన కల్పించడం కోసం సిబ్బందికి ముందుగా శిక్షణ ఇవ్వనున్నారు. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా విధించడంతో పాటు, వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు.వాస్తవానికి సిగరేటు, పొగాకు ఉత్పత్తులను నిషేధ చట్టం 2003 సెక్షన్ 4 ప్రకారం బహిరంగ ప్రదేశాలలో పొగ తాగడం నిషేధం. ఈ నిబంధన అతిక్రమిస్తే రూ.200 వరకు జరిమానా విధించనున్నారు. అలాగే సెక్షన్ 5 ప్రకారం పొగాకు ఉత్పత్తులపై ప్రచారాన్ని నిషేధించారు. ఈ నిబంధన ఎవరైనా అతిక్రమిస్తే రెండేళ్ల వరకు లేదా వెయ్యి రూపాయల జరిమానా, కొన్ని సందర్భాల్లో జరిమానా, జైలు శిక్ష రెండూ కలిపి విధించనున్నారు. సెక్షన్ 6 ఏ ప్రకారం విశ్వ విద్యాలయాల పరిసరాల్లో పొగాకు నమలడం,ఉత్పత్తులను విక్రయించడంపై కూడా నిషేధం ఉంది. సెక్షన్ 6 బి ప్రకారం 18 సంవత్సరాలలోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులు అమ్మడం లేదా వారిచే అమ్మకాలు చేపట్టడం కూడా నేరమే. అయినప్పటికి కొన్ని చోట్ల యథేచ్ఛగా పొగాకు విక్రయాలు జరుగుతున్నాయి. మరోవైపు ఆలయాలు పబ్లిక్ ప్లేస్‌లు కావడంతో ఇక్కడ బహిరంగ ధూమపానం చేయడం చట్టరీత్యా నిషేధం. దీంతో పాటు ఇక నుంచి ఆలయ పరిసరాల్లో ధూమపానం నిషేధం అమలుచేయాలని ఏలూరు జిల్లా అధికారులు నిర్ణయించారు.

## జనసేనాని కామెంట్స్ పై చర్చోపచర్చలు

విజయవాడ, డిసెంబర్ 5, విద్యార్థులు పరీక్షలో ఫెయిలై బాధపడుతుంటే.. స్నేహితులు, బంధువులు, తల్లిదండ్రులు ఓదారుస్తారు. మార్చిలో ఫెయిలైతే ఏమైంది సెప్టెంబర్ ఉందిగా శ్రద్ధగా పట్టుదలగా చదివి ఈ సారి పాసవుదువుగాని లే అంటారు. అదే ఆ విద్యార్థి తాను ఫెయిలయ్యాననీ, ఈ సారి గట్టిగా చదివి పాసౌతాననీ అంటే.. ఏంత నిర్లక్ష్యం.. సరిగా ప్రిపేర్ కాకుండా ఎందుకు ఉన్నావు. ఒక ఏడాది నష్టపోవడమంటే కెరీర్ లో ఎంత వెనుకబడిపోతావు అంటూ అక్షింతలు వేస్తారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ 2019 తన వైఫల్యాన్ని అంగీకరించడం కూడా విద్యార్థి పరీక్ష ఫెయిలవ్వడం లాంటిదేనని చెప్పుకుంటున్నారు. రాజకీయాల్లో తాను విఫలమయ్యాననీ, అయితే పట్టుదలగా ప్రయత్నిస్తున్నానని చెప్పారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో చార్టెడ్ అకౌంటెంట్స్ విద్యార్థుల సమావేశంలో ప్రసంగించిన ఆయన జీవితంలో కష్టాలు, ఓటములను అధిగమించాలని చెప్పారు. చార్జెడ్ అక్కౌంట్స్ ఎంత కష్టమో తనకు తెలుసునన్నారు. అందుకే ఫెయిలయినా నిరాశ చెందకుండా మళ్లీ మళ్లీ ప్రయత్నించాలని చెప్పారు.ఈ సందర్భంగా ఆయన తననే ఉదాహరణగా చెప్పారు. రాజకీయాలలో తాను విఫలమయ్యానన్నారు. అయితే పట్టు వదలకుండా మళ్లీ ప్రయత్నిస్తున్నానని చెప్పుకొచ్చారు. 2019లో తాను ఫెయిలయ్యానని.. కానీ నిరాశ చెందకుండా.. పట్టువదలకుండా ప్రయత్నిస్తున్నాన్నారు. వైఫల్యాలను కూడా తాను సానుకూల దృక్పథంతోనే చూడాలన్నారు.తాను సమాజంలో మార్పు రావాలని కోరుకుంటున్నాననీ, అయితే అందుకోసం ఏమీ చేయకుండా కూర్చునే రకం తాను కాదనీ అన్నారు. తాను విఫల రాజకీయ నేతనన్న విషయాన్ని స్వయంగా అంగీకరించడానికి తనకేం అభ్యంతరం లేదనీ, ఓటమి నేర్పిన పాఠాలే భవిష్యత్ విజయానికి పునాదులనీ పవన్ అన్నారు.మార్చి పోతే సెప్టెంబర్.. సెప్టెంబర్ పోతే మార్చి.. ఇలా అవకాశాలు వస్తూనే ఉంటాయన్నారు. వైఫల్యం విజయానికి బాట వేస్తుందని పవన్ కల్యాణ్ అన్నారు. తనకు తానే తానొక విఫల రాజకీయవేత్తనని పవన్ కల్యాణ్ చెప్పుకోవడం రాజకీయవర్గాలనే కాకుండా జన శ్రేణులను కూడా విస్మయ పరిచింది. విద్యార్థులలో స్ఫూర్తి నింపడం అన్న పేరుతో పవన్ కల్యాణ్ పార్టీ శ్రేణుల్లో నిరాశను నింపుతున్నారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## వైకాపా నుంచి జనసేన లోకి?

నర్సాపురం పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మండలం ఎల్బీ చర్ల గ్రామంలో వైసీపీ కి ఎదురుదెబ్బ తగిలింది.గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గుబ్బల మార్రాజు తో పాటు మరో యాభై మంది వైసీపీ కి గుడ్ బై చెప్పారు. నర్సాపురం జనసేన పార్టీ ఆఫీసులో నరసాపురంనియోజకవర్గ ఇంచార్జ్ బొమ్మిడి నాయకర్ సమక్షంలో జనసేనలో చేరారు. వైసీపీ లో కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు లభించడం లేదని మాజీ ఉప సర్పంచ్ గుబ్బల మార్రాజు అన్నారు.ఈ సందర్భంగా జనసేన ఇంచార్జ్ నాయకర్ వారికి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు.అనంతరం నాయకర్ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కులమత బేధాలు లేకుండా అన్ని కులాలను కలుపుకుని జనసేన పార్టీని స్థాపించి గత ఎన్నికల్లో మొట్ట మొదటి సీటు ను బిసి సామాజిక వర్గానికి కేటాయించారని గుర్తు చేశారు.




### దాల్మియా సిమెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముఖేశ్ సిన్హా

కడప డిసెంబర్ 05: గనులలో కార్మికులు భద్రతతో పనిచేయాలని 37వ గనుల భద్రత వారోత్సవాల లో దాల్మియా సిమెంట్ ముఖేష్ సిన్హా పేర్కొన్నారు ఆదివారం కడప నగర శివారులో మేడా కన్వెన్షన్ హాల్లో 37వ గనుల భద్రత వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల సమావేశం సమావేశం దాల్మియా సిమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ప్రభాత్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ మలైతీ ఖదార్, డైరెక్టర్ ఆఫ్ మైన్స్ (తెలంగాణ) సుప్రియో చక్రబూర్ధి హాజరై మాట్లాడుతూ గనులలో ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులు జాగ్రత్తతో పనిచేయాలని తెలిపారు కార్మికులు హెల్మెట్లు బూట్లు దుస్తులు తప్పనిసరిగా ధరించాలని తెలిపారు అన్ని సిమెంట్ రంగాలలో పనిచేసే కార్మికులకు భద్రత కల్పించడానికి అవగాహన కార్యక్రమం ప్రతి సంవత్సరం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు 44 మైన్స్ కంపెనీల కలసి దాల్మియా సిమెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషకర మైందన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని నిర్మించడానికి సహాయ సహకారాలు అందించిన కేంద్ర ప్రభుత్వం, ఆంధ్ర, తెలంగాణ ముఖ్యమంత్రులు, గవర్నర్లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం దాల్మియా సిమెంట్ మేనేజింగ్ హెడ్ సురేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కార్మికులు భద్రతతో పని చేస్తూ తగిన జాగ్రత్తలు మెలకువలు పాటించాలని కోరారు ఈ వారోత్సవాలు ఎంతో ఘనంగా జరిపేందుకు దాల్మియా సిమెంట్ ఎంతో సహాయ సహకారాలు అందించి ఈ ముగింపు కార్యక్రమంలో సాంస్కృతి కార్యక్రమాల సభ సభ్యులను ఎంతో ఆగట్టుకుని అల్లరింప చేశాయి అలాగే దాల్మియా ఫ్యాక్టరీలో పని చేసిన వారికి బహుమతులు ప్రధానం చేయడం జరిగింది అని తెలిపారు

## పుంగనూరులో జనసేన నేతలపై దాడులు

తిరుపతి, డిసెంబర్ 5, చిత్తూరు జిల్లా పుంగనూరులో పారిశ్రామికవేత్త రామచంద్రయాదవ్ ఇంటిపై దాడి జరిగింది. గత ఎన్నికల్లో ఆయన జనసేన తరఫున పోటీ చేశారు. నియోజకవర్గంలో రైతు సమస్యలపై రైతు భేరీ కార్యక్రమాన్ని తలపెట్టారు. దీనికి అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. సభకు వెళ్లకుండా రాచంద్రయాదవ్‌ను అడ్డుకున్న పోలీసులు సాయంత్రం ఐదున్నర గంటలకు వదిలేశారు. తర్వాత తన అనుచరులతో కలిసి స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి క్షీరాభిషేకం చేశారు. తర్వాత అనుచరులంతా ఎవరి ఇంటికి వాళ్లు వెళ్లిపోయారు. అనంతరం రామచంద్రయాదవ్ ఇంటిపై దాడి జరిగింది. ఇది చేసింది వైసీపీ కార్యకర్తలేనంటూ ఆయన వర్గీయులు ఆరోపిస్తున్నారు. రైతుల సమస్యలపై సభ తలపెట్టామని.. దీన్ని జీర్ణించుకోలేకే తమ ఇంటిపై దాడి చేశారని ఆయన అనుచరులు విమర్శిస్తున్నారు. ఆదివారం రాత్రి పుంగనూరు పట్టణం కొత్తిండ్లు ఎల్ఐసీ కాలనీలో ఉన్న ఇంటికి వెళ్లి కొందరు యువకులు వీరంగం సృష్టించారు. కర్రలు, రాళ్లతో తలుపులు, అద్దాలు పగలకొట్టి లోపలకు వెళ్లి, ఫర్నిచర్ ధ్వంసం చేశారు. పార్క్ చేసి ఉన్న కార్లు, బైక్‌లపై విరుచుకపడ్డారు. ఈ దుర్ఘటనలో ఆరు కార్లు, మరిన్ని వాహనాలు ధ్వంసం అయ్యాయి. అదే ఇంట్లో ఉన్న తను తన ఫ్యామిలీ ఓ గదిలో దాక్కొని ప్రాణాలతో బయట పడ్డామంటున్నారు రామచంద్రయాదవ్. తమ నాయకుడు సదుం వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు ఇంత దాడి జరిగినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు ఆయన సన్నిహితులు. సుమారు 200 మంది వచ్చి దాడి చేశారని చెబుతున్నారు. వచ్చిన వాళ్లంతా తాళాలు పగలగొట్టి... ఇంట్లోకి ప్రవేశించారు. సుమారు అరగంట పాటు వీరంగం సృష్టించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సరైన రీతిలో స్పందించలేదని రామచంద్రయాదవ్ అనుచరులు ఆరోపిస్తున్నారు. వచ్చిన వారిని బతిమలాడి పంపిస్తున్నారే తప్ప దాడి చేస్తున్న వారిపై సీరియస్‌గా రియాక్ట్ కాలేదంటున్నారు. రామచంద్రయాదవ్ అనుచరుల ఆరోపణలను పోలీసులు ఖండిస్తున్నారు. కొందరు వ్యక్తులు మద్యం మత్తులో రామచంద్ర యాదవ్ ఇంటిపై దాడి చేశారని చెప్పారు. విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్నామన్నారు. లీఛార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చినట్టు వివరించారు. దీనిపై ఇంత వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని అందుకే కేసు రిజిస్టర్ చేయలేదని వివరిస్తున్నారు. తమపై వస్తున్న ఆరోపణలను వైసీపీ లీడర్‌లు ఖండిస్తున్నారు. రాత్రికి రాత్రే ఎదగాలని అనుకుంటున్న రామచంద్ర యాదవ్... ఇలాంటి పన్నాగాలు చేస్తున్నారని మండిపడుతున్నారు. ఈ దాడిపై వైసీపీ లీడర్లు అనుమాం వ్యక్తం చేస్తున్నారు.

## అగ్రి సదస్సులో కడప స్టాల్స్ ను అభినందించిన మంత్రి

### అగ్రి టెక్ సదస్సులో ఏరువాక కేంద్రం





చింతకొమ్మదిన్నె: డిసెంబర్ 5 ఆచార్య యన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్తంగా గుంటూరు లోని లాం ఫారం లో ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపైన రాష్ట్ర స్థాయి అగ్రి టెక్ -2022 సదస్సు ప్రదర్శనలను మూడు రోజుల పాటు డిసెంబరు 3 నుండి 5 వ తేదీ వరకు నిర్వహించారు. కడప జిల్లా ఏరువాక కృషి విజ్ఞాన కేంద్రం స్టాల్స్ ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి సందర్శించి అభినందించారు, ఈ సదస్సులో భాగంగా ఏరువాక కేంద్రం, ఊటుకూరు వారు కడప జిల్లాలో ప్రధానంగా పండించే మైదుకూరు లోకల్ పసుపు రకం, కుర్కుమిన్ అధిక శాతం (6-7%) కల్గిన రాజేంద్ర సోనాలి పసుపు రకం కొమ్ములు, కడప జిల్లాలో ప్రధానంగా పండించే చామంతి బుల్లెట్ వైట్, బుల్లెట్ ఎల్లో, థమ్సప్ వయొలెట్, ఐశ్వర్య అనే రంగు రంగు పూల మొక్కలు పూలను ప్రదర్శించారు. ఏరువాక కేంద్రం, ఊటుకూరు వారి స్టాల్ ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ డా.ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఆచార్య యన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ ఉప కులపతి డా.ఎ. విష్ణువర్ధన్ రెడ్డి పలువురు విశ్వవిద్యాలయ అధికారులు, డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డా.బి.కరుణ ,రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు ఐ.తిరుపాల్ రెడ్డి, వివిధ పాటశాలలు, కళాశాలల విద్యార్థులు, రాష్ట్రం నలు మూలల నుంచి విచ్చేసిన రైతులు సందర్శించి రంగు రంగు పూలను చూసి ఆకర్షితులవ్వడంతో పాటు పూల సాగుపైన ఆసక్తి కనబరిచారు. ఏరువాక కేంద్రం, ఊటుకూరు కోఆర్డినేటర్ డా.టి.మురళీకృష్ణ మాట్లాడుతూ వారి స్టాల్ ను సందర్శించిన కృష్ణా జిల్లా రైతులు కూడా కడప జిల్లాకు ప్రత్యేకమైన మైదుకూరు లోకల్ పసుపు రకమే ఇప్పటికీ సాగు చేస్తున్నామని చెప్పారన్నారు. 5 వ తేదిన కడప జిల్లా నుండి కడప జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వర రావు సహకారంతో ఒక్కొక్క వ్యవసాయ డివిజన్ నుండి 10 మంది రైతుల చొప్పున మొత్తం 80 మంది రైతులను అగ్రి టెక్ 2022 కు హాజరయ్యేలా ఏర్పాట్లు చేసామని చెప్పారు. ఈ సదస్సుకు ఏరువాక కేంద్రం, ఊటుకూరు, కడప శాస్త్రవేత్తలు .యస్.రామలక్ష్మి దేవి, సి.ప్రత్యూష పాల్గొని వ్యవసాయ ప్రదర్శనను సందర్శించిన వారి సందేహాలను నివృత్తి చేసారు

## ఆక్వా రైతుల్లో ఐక్యత లేకపోవడం వల్లే సమస్యలు

ఏలూరు, డిసెంబర్ 5, ఆక్వా పరిశ్రమలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉందని, ఆక్వా రైతుల్లో ఐక్యత లేకపోవడం వల్ల ఎగుమతిదారులకు లాభాలు తెచ్చిపెడుతోందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆక్వా అధ్యక్షుడు సీహెచ్‌ఎసి సూర్యారావు అన్నారు. రైతులు ఐక్యంగా పోరాడితేనే వారు దిగి వస్తారని అభిప్రాయపడ్డారు. ముమ్మిడివరం నియోజకవర్గం ఐ.పోలవరం మండలంలోని ఆక్వా రైతులు బాణాపురంలో సమావేశం అయ్యారు. మార్కెట్ ధరలకు కనీసం రొయ్యల మేత కూడా రావడం లేదని.. దీని వల్ల లక్షల్లో నష్టాలు వస్తున్నాయని అన్నారు. కోడి గుడ్డు రైతులకు ఎన్ఐసీసీ ఉన్నట్లు ఆక్వా రైతులకు ఎన్ఎఎఫ్ సీగా ఒక సంస్థను ఏర్పాటు చేసుకోవాలని, రొయ్యలకు డొమెస్టిక్ మార్కెట్ ఇండియాలోనే అభివృద్ధి చేయాలని రైతులు డిమాండ్ చేశారు. 2030 దాటికి ప్రపంచంలో 30 శాతం రెడ్ మీట్ వాడకం పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారని, అందుకు అనుగుణంగా ఆక్వా రైతులు ఆలోచనలు ఇవ్వాలన్నారు. ఆక్వా రైతులకు ఉచితంగా విద్యుత్ ఇవ్వాలనీ, ఆక్వా కంపెనీలు రొయ్యల ధరలు స్థిరీకరించాలని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్కెట్ ధరలు ఇలా ఉంటే భవిశ్యత్ లో పంట విరామం ప్రకటించేందుకు వెనకడుగు వేయబోమని సమావేశం తీర్మానించింది. సమావేశంలో ముదునూరి సతీష్ రాజు, భూపతీరాజు బులిరాజు, దాట్ల పృథ్వీరాజు, పిన్నంరాజు శ్రీనివాసరాజు, లంకలపల్లి బుల్లియ్య, ఏలూరి ఆదినారాయణ తదితర రైతులు పాల్గొన్నారు.ఇటీవలే టీడీపీ “ఇదేం ఖర్మ.. ఆక్వా రైతాంగానికి” రాష్ట్ర స్థాయి సదస్సును కూడా నిర్వహించింది. తెలుగుదేశం హయాంలో దేశంలోనే అగ్ర స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఆక్వా రంగం.. నేడు సీఎం జగన్ రెడ్డి చర్యలతో పతనావస్థకు చేరుకుందని కింజారపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. సంక్షోభంలో ఉన్న ఆక్వా రైతులకు అండగా నిలబడేందుకే గురువారం ఈ సదస్సు నిర్వహించినట్లు తెలిపారు.

## పంచాయితీ అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

### గొల్లల మామిడాడ గ్రామస్థులు

కాకినాడ గత ప్రభుత్వ అధికారంలో పెదపూడి మండలం గొల్లల మామిడాడ గ్రామపంచాయతీ నిధులు, వసూలు చేసిన ఇంటి పన్నులు జమ చేయకుండా దుర్వినియోగం జరిగింది. వీటిపై గొల్లలమామిడాడ ప్రజాప్రతినిధుల బృందం పెదపూడి మండలంలో జిల్లా స్పందన కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు, మాజీ మండల అధ్యక్షులు కర్రి వెంకట రెడ్డి కలెక్టర్ కు పిర్యాదు చేసారు. గ్రామపంచాయితీ తీర్మానం లేకుండానే కొన్ని బిల్లులు చేసినట్టు వచ్చిన ఆరోపణపై 2019 న అప్పటి కలెక్టర్ కు గొల్లల మామిడాడ ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు ఫిర్యాదు చేసారు. దానిపై విచారించి, అవకతవకలు జరగడం వాస్తవమనీ ఇ ఓ పీ ఆర్ డి, డి ఎల్ పి ఓ లు నిర్ధారించారు. అయినా ఇప్పటివరకు ఏ విధమైన చర్యలు తీసుకోకపోవడంతో సోమవారం ఈ విషయం కలెక్టర్ కు వివరించారు. కలెక్టర్ వెంటనే సంబంధిత అధికారులను పిలిచి ఈ విషయంపై మందలించి, తదుపరి వెంటనే చర్యలకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వేపకాయల వెంకటలక్ష్మి వెంకటరమణ, ఎంపీపీ కేత తులసి శ్రీనివాస్, గొల్లలమామిడాడ గ్రామ సర్పంచ్ లంక మున్ని ఉపసర్పంచ్ మేడపాటి తాతారెడ్డి మాజీ జెడ్పిటిసి సత్తి భగవాన్ రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ద్వారంపూడి వెంకటరెడ్డి కోల్డ్ ఫారం, వైకాపా నాయకులు ద్వారంపూడి చింతపండు వెంకటరెడ్డి తదితరులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## బస్సు - లారీ ఢీ? నలుగురు మృతి

నెల్లూరు ఆంధ్ర సరిహద్దు దాటినా తరువాత తమిళనాడు పరిధి లోని పొన్నేరి సమీపం లో జాతీయరహదారి పై సోమవారం తెల్లవారు జామున ఘోర రోడ్ ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుండి చెన్నై వెళుతున్న ప్రెవేటు ట్రావెల్స్ బస్సును టాంకర్ లారీ డీ కొట్టడం తో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం లో బస్సు క్లినర్ శ్రీధర్ తో పాటు నెల్లూరు జిల్లా విడవలూరు ప్రాంతానికి చెందిన తోకల సతీష్ కుమార్ ,బెంగుళూరుకు చెందిన తుమ్మల రోహిత్ లు అక్కడికక్కడే మృతి చెందానేజ ఈ బస్సు ప్రమాదం జరిగిన ప్రాంతానికి కిలోమీటర్ దూరం లో చెన్నై వెళ్ళడానికి బస్సు ఎక్కిన తమిళనాడు ఆర్టీసీ డ్రైవర్ జానకిరామ్ కూడా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు, నుజ్జు నుజ్జు ఐన బస్సులో చిక్కున్న మృతుల మృత దేహాలను కవర్ పేట పోలీస్ లు అగ్నిమాపక సిబ్బంది సహకారం తో మృతదేహాలను వెలికి తీసారు.

## మృతుల కుటుంబాలకు ఐదు లక్షలు ఎక్స్ గ్రేషియా

### మంత్రి జోగి రమేష్

విజయవాడ పెడన నియోజకవర్గం కృత్తివెన్ను మండలం నీలిపూడి గ్రామానికి చెందిన నలుగురు అయ్యప్ప స్వామి భక్తులు ఘోర రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడిన విషయాన్ని తెలుసుకున్న తరువాత మంత్రి జోగి రమేష్ నేరుగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కలిసి బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేసారు. మంత్రి జోగి రమేష్ చెప్పిన మాటలు విని, ముఖ్యమంత్రి ప్రమాదం పట్ల విచారం వ్యక్తం చేసారు. మృతి చెందిన నలుగురు వ్యక్తుల కుటుంబాలకు ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయల చొప్పున పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులైన మరో 19 మందికి తక్షణమే 50 వేల రూపాయల చొప్పున ఎక్సగ్రేషియా ప్రకటించారు. తక్షణమే మృతుల కుటుంబాలకు ఆర్థిక పరిహారం మరియు క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాల్సిందిగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మంత్రి జోగి రమేష్ సమన్వయం చేసుకుంటూ బాధితులకు అన్ని రకాలుగా అండగా ఉండాలని అధికారులకు సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. వేమూరు మండలం జంపని దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అదుపు తప్పి టాటా ఏస్ వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు అయ్యప్ప భక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందగా..ప్రమాదంలో మరో 16 మందికి గాయాలయ్యాయి. క్షథగాత్రులను స్థానికులు తెనాలి ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులు: బొలిశెట్టి పాండురంగారావు (40), పాశం రమేష్ (55), బోదిన రమేష్ (42), బుద్దన. పవన్ కుమార్ (25)గా పోలీసులు తెలిపారు. మృతులంతా కృష్ణా జిల్లా నిలిపూడి వాసులుగా పోలీసులు గుర్తించారు.

## మహిళ అస్థిపంజరం కలకలం

విశాఖపట్నం విశాఖలో మహిళ అస్థిపంజరం కలకలం రేపింది. నగరంలోని మధురవాడ కొమ్మాది వికలాంగుల కాలనీలో నీళ్ల డ్రమ్ములో కుళ్లిన స్థితిలో అస్థిపంజరం లభించడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.నందూరి రమేష్ అనే వ్యక్తి ఎండాడలో వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు.. ఆయనకు వికలాంగుల కాలనీలో ఓ ఇల్లు ఉంది. రెండేళ్ల క్రితం శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన రుషి అనే వ్యక్తి రమేష్ దగ్గర పనికి చేరాడు. దీంతో రమేస్ రుషి కుటుంబం ఉండేందుకుకాలనీలోని తన ఇంటిని అద్దెకు ఇచ్చాడు. ఆ ఇంట్లో రుషితో పాటు

అతడి భార్య, కూతురు ఉండేవాళ్లు.రుషి భార్య గర్భవతి కావడంతో రెండు నెలల క్రితం పుట్టింటికి వెళ్లడంతో ఇంటిని ఖాళీ చేశాడు.ఈ క్రమంతో ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులకు అనుమానం వచ్చింది. వెంటనే యజమాని రమేష్ ఏఎ సమాచారం ఇచ్చారు. ఆయన ఇంటి తాళం తీసి చూడగా నీళ్ల డ్రమ్ములో మహిళ మృతదేహం కుళ్లిన స్థితిలో కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. ఏసీపీ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.డ్రమ్ములో మృతి చెందిన మహిళ.. గతంలో ఆ ఇంట్లో అద్దెకు ఉన్నవారా.. లేక ఇంకెవరినైనా హత్య చేసి డెడ్బాడీని తెచ్చి ఇక్కడ దాచారా అని అనుమానిస్తున్నారు. ఇంటి యజమాని రమేష్ పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# దేశ ఐక్యత కోసమే రాహుల్ గాంధీ గారి పాదయాత్ర....

**ఎన్ ఎస్ యు ఐభరత్ జోడోయాత్ర కు మద్దతుగా విద్యార్థుల తో సంతకాల సేకరణ కార్యక్రమం భారత్ జోడయాత్ర అధికారం కోసం కాదు, దేశత ఐక్యత కోసమే అని చాటి చెప్పిన శ్రీ రాహుల్ గాంధీజీ**



ఎమ్మిగనూరు, ( విభారె) ఎమ్మిగనూరు పట్టణంలో భారతదేశంలోని ప్రజలు విద్యార్థులు యువత కులమత భేదం లేకుండా ఐక్యఉండాలని, విద్యార్థులకు యువతకు దేశంలో మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వం క్రియ శీల ప్లేస్మెంట్ అవకాశాలు కల్పించాలని, విద్యార్థులకు రెగ్యులర్ స్కాలర్షిప్లు అందించాలని, సరైన సమయంలో ప్రవేశ పరీక్ష లను నిర్వహించాలని, పరీక్షల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలు అరికట్టాలని, పరిశుభ్రమైన హాస్టల్లో మరియు క్యాంటీన్లు యూనివర్సిటీలలో కళాశాలలో వసతి గృహాల్లో ఏర్పాటు చేయాలని, ఉన్నత మరియు స్థానిక విద్యను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ఫీజుల పెంపుదలను వ్యతిరేకిస్తూ భారత్ జోడోయాత్రాల్లో విద్యార్థుల సమస్యలపై మాట్లాడుతున్నట్లు ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ సోమవారం బాలికల కళాశాలలో విద్యార్థులతో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ నాయకులు రంగస్వామి, రవికుమార్, సోమిరెడ్డి అజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

# 10 సంవత్సరాల సర్వీసు లోపు ఉన్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల్ని తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలి.



బద్వేలు మేము అధికారంలోకి వస్తే కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ కూడా రెగ్యులరైజ్ చేస్తామని, సమాన పనికి- సమాన వేతనం ఇస్తామని ముఖ్యమంత్రి గారు హామీ ఇచ్చారని, ఆ హామీకి భిన్నంగా వర్క్స్ మరియు అకౌంట్స్ డిపార్ట్మెంట్లో 10 సంవత్సరాల సర్వీస్ లోపు ఉన్న 12 మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులని తొలగించాలని ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) బద్వేలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నెల్లూరు రోడ్డులోని అంబేద్కర్ సర్కిల్ వద్ద జీవో ప్రతులను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె. నాగేంద్రబాబు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం 10 సంవత్సరాల సర్వీసు పూర్తికాని కార్మికులను తొలగించాలని నిర్ణయం తీసుకోవడం ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం చేయడం తప్ప మరొకటి కాదని, సాక్షాత్తు ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకుడు హోదాలో అసెంబ్లీలో మాట్లాడుతూ ఔట్సోర్సింగ్ వేరు కాంట్రాక్టు వేరు కాదని ఇద్దరు చేసే పని ఒకటేనని వాళ్ళందరినీ కూడా రెగ్యులరైజ్ చేయాలని, మీ ప్రభుత్వం చేయకపోతే చెప్పండి మేము అధికారంలోకి వస్తానే రెగ్యులర్ చేస్తామని చెప్పి మాట్లాడిన మాటలను మరచి ఈరోజు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులరైజ్ చేయకపోగా ఎన్నికల సందర్భంగా మానిఫెస్టోలో పెట్టిన అంశాల ప్రకారం సమాన పనికి- సమాన వేతనం అమలు చేయకపోగా ఉద్యోగుల 10 సంవత్సరాలు సర్వీస్ లోపు ఉన్న 12 మంది ఉద్యోగులను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం 1232 నెంబర్ ప్రకారం ఉత్తర్వులు జారీ చేయడం అనేది దుర్మార్గం అని, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు 184598 డి 281122 ప్రకారం వీళ్ళందర్నీ

**జీవో ఉత్తర్వు కాపీలను దగ్ధం చేసిన సిఐటియు నాయకులు**



కూడా తొలగిస్తున్నట్టు స్పష్టంగానే తెలియజేస్తోందని, ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు నేరుగా జోక్యం చేసుకొని సంబంధిత అధికారులు ఉపసంహరించుకునేల వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరూ కూడా పెద్దఎత్తున్న ఆందోళన నిర్వహిస్తమని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇప్పటికే ముఖ్యమంత్రి మేము ఏ ఒక్క ఉద్యోగిని కూడా తొలగించాం అని చెప్పిన మాటను నిల బెట్టుకోవాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు)గా కోరారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డివిజన్ సెక్రెటరీ పి.సి. కొండయ్య, బద్వేల్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ -అధ్యక్ష కార్యదర్శులు పులి శ్యాం ప్రవీణ్, దియ్యాల నాగేంద్రబాబు, తోపుడు బండ్ల వ్యాపారస్తుల యూనియన్ గౌరవాధ్యక్షుడు పటాన్ చాంద్ బాషా, ఆటో వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి ఇరగదిండ్ల రమణయ్య, సిఐటియు పట్టణ నాయకులు జి. శ్రీనివాసులు, కె. శివకుమార్, డి.హరి, డి. దేవమ్మ, ఎన్. సత్యరాజు, ఎన్. పాలయ్య, బి. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ ద్రోహి ఎవరో త్వరలో ప్రజలే తెలుస్తారు ఇదేంకర్మ

**- మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి, పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి**



కౌతాళం : రాయలసీమ ద్రోహి ఎవరో త్వరలో ప్రజలే బుద్ధి చెబుతారని, వైయస్సార్ పార్టీ నాయకులకు రాయలసీమ ప్రాంతం ఇపుడు గుర్తుకు వచ్చిందా మీకు మూడున్నర సంవత్సరంలో రాయలసీమ కు ఏమి చేశారో జగన్ మోహన్ రెడ్డి సమాధానము చెప్పాలని మంత్రాలయం నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. వారు కౌతాళం మండలం లోని ఉరుకుందు గ్రామంలో ఇదేంకర్మ- మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రజలు సమస్యలు తెలుసుకున్నారు. ఎన్నికలలో వైయస్సార్ పార్టీ అనేక హామీలు ఇచ్చి ఇపుడు ప్రజలను మోసము చేసి అబద్ధపు మాటలు చెపుతూ కాలయాపన చేయడం తప్ప చేసింది ఏమి లేదు అని నిత్యావసర వస్తువులు నుండి అన్ని రకాల వస్తువులు రెట్లు పెంచి ప్రజలపై భారం మోపి తుగ్లక్ పాలన కొనసాగిస్తూ రాక్షస పాలన నడుపుతున్న పార్టీ వైయస్సార్ పార్టీ అని పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో తెలుగు దేశం పార్టీ అధికారం లోకి వస్తుంది ప్రజలు సమస్యలు పరిష్కారం చేస్తాం అని అన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి కోట్రేష్ గౌడ్, కురుగోడు,సర్పంచ్ అధికార ప్రతినిధి సురేంద్ర, దమ్మలదిన్ని రమేష్ గౌడ్, బాపురం వెంకటరెడ్డి,సైకిల్ షాపు నరసింహులు,ఒబుళపురం నరసింహులు, టి యన్ యస్ ఎఫ్ రామచంద్ర, దుద్ది ఉసేని,ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# టిట్కో గృహాల పంపిణీ చేయాలని లబ్ధిదారులతో సిపిఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముట్టడి

నంద్యాల జిల్లా నవంబర్ 5 నంద్యాల పట్టణంలో 10 వేల టిడ్కో గృహాలను పేద ప్రజలకు ప్రభుత్వం పంపిణీ చేయకుండా కాలయాపన చేస్తూ లబ్ధిదారులను మోసం చేస్తున్నదని,ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి నిరసనగా నంద్యాల పట్టణంలో వందలాదిమంది లబ్ధిదారులతో మున్సిపల్ కార్యాలయం ముట్టడించారు.పెద్ద ఎత్తున నినాదాలతో మున్సిపల్ ప్రాంగణం మార్మోగింది.ఈ ఆందోళనకు సిపిఐ నంద్యాల పట్టణ కార్యదర్శి కే ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు,సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల మందికి టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు టిడ్కో గృహాలను మంజూరు చేసి లబ్ధిదారులను ఎంపిక చేసి దాదాపు 90% పనులు పూర్తి చేశారు.కానీ లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాల కాలం పూర్తయింది. కానీ

**వాలంటరీల బెదిరింపులను లెక్కచేయని లబ్ధిదారులు**

లబ్ధిదారులకు టిడ్కో గృహాలు ఇవ్వలేదు. దీనిపై సిపిఐ ఆధ్వర్యంలో పోరాటం చేసినప్పుడు మాత్రమే వెంటనే పూర్తి చేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి లబ్ధిదారులకు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు.దీనిపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలపై నిరంకుశ దొరణిగా వ్యవహరిస్తున్నారు.తక్షణమే ఇవ్వకపోతే లబ్ధిదారులతో గృహప్రవేశాలు కల్పిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.పేద ప్రజల సమస్యలు పరిష్కారం చూపకుండా ప్రతిపక్ష పార్టీలపై రాయలసీమ గర్జన పేరుతో అధికార పార్టీ కర్నూల్లో సభలు నిర్వహించడం సిగ్గుచేటని వారు విమర్శించారు.రాయలసీమ అభివృద్ధికి వైఎస్ఆర్ పార్టీ ఏమి చేయలేదు.రాయలసీమ అభివృద్ధికి నిధులు కేటాయించలి, కడప స్టీల్ ప్లాంట్ నిధులు ఎంత ఖర్చు చేశారో, పెండింగ్ ప్రాజెక్టులకు మూడు సంవత్సర కాలం ఎన్ని కోట్లు ఖర్చు చేశారో, చెప్పి ఆ తర్వాత సభలు పెట్టాలని వారి హితవు పలికారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న కాలనీ పేరుతో గ్రామాల చివర కాలనీలు ఏర్పాటు చేశారు. నవరత్నాలలో భాగంగా అందరికీ ఇల్లు కట్టించి ఇస్తామని నేడు కేవలం ఒక లక్ష ఎనభై వేల రూపాయలు ఇస్తున్నారు. ఈ డబ్బు సరిపోవడం లేదు. కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు డిమాండ్ చేశారు.నంద్యాల పట్టణాల్లో లబ్ధిదారులకు సర్వే చేస్తుంటే వారిని వాలంటీర్లు బెదిరించడం సరైంది కాదని,ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారాయుడు,సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి సోమన్న, ఒంఎజఅ అధ్యక్ష,కార్యదర్శులు భూమని శ్రీనివాసులు,డి.శ్రీనివాసులు,ఒంమోఈ నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయుడు,ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు శివయ్య, వాసు,ఒంమోఈ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి,ఉపాధ్యక్షుడు సురేష్,ఒంఎజఈ జిల్లా సహాయ కార్యదర్శి రవి కుమార్,ప్రజానాట్యమండలి కళాకారులు రమేష్,విజయ్ మరియు సీపీఐ నాయకులు అక్బర్ నారాయణమ్మ ఖలీల్ హుస్సేన్నా దానియేలు రమణారెడ్డి సిద్దయ్య ఈశ్వర్ సుబ్బరాయుడు కలాం దానం పాల్గొన్నారు

# 2జీవో 52 తక్షణమే రద్దు చేయాలి

విశాఖపట్నం బోయ వాల్మీకి, అగ్రకులాల్లో ఉన్న వారిని ఆదివాసి జాబితాలో చేర్చే జీవో 52ను తక్షణమే రద్దు చేయాలని విశాఖలో ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సెంట్రల్ చైర్మన్ చక్రి నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు దక్షిణ నియోజకవర్గ పరిధిలో గల జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఉన్న ఎస్టీల కంటే చాలా కాలం క్రితమే సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా అనేక రంగాల్లో అభివృద్ధి చెందిన గిరిజనేతరులకు ఎస్టి రిజర్వేషన్ కల్పిస్తే నిజమేనా ఆదివాసీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# సలార్ రెండు పార్ట్ ల విషయం ఇంకా సస్పెన్స్ లోనే..!

కేజీఎఫ్ మరియు కేజీఎఫ్ 2 సినిమాల తర్వాత దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా సలార్. ఈ సినిమా షూటింగ్ ప్రారంభం అయ్యి చాలా కాలం అయ్యింది. ఈ ఏడాది ఆరంభంలోనే సినిమాను విడుదల చేస్తాం అన్నట్లుగా మేకర్స్ ఆ మధ్య ప్రకటించారు. కానీ కరోనా ఇతర కారణాల వల్ల సినిమా షూటింగ్ అనుకున్న సమయానికి జరగడం లేదు.ఇదే సమయంలో కేజీఎఫ్ 2 సినిమా తర్వాత సలార్ పై అంచనాలు మరింతగా పెరిగాయి. వెయ్యి కోట్ల సినిమాను తెరకెక్కించిన ప్రశాంత్ నీల్ సలార్ ను కూడా అదే స్థాయిలో ఉండాలి అనే ఉద్దేశ్యంతో అంతకు ముందు చేసిన కొన్ని సీన్స్ ను కూడా తొలగించి మళ్ళీ ఫ్రెష్ గా షూటింగ్ ను ప్రారంభించాడు అనే ప్రచారం జరిగింది.మధ్య లో సలార్ ను రెండు పార్ట్ లుగా చేసేందుకు



దర్శకుడు ప్రశాంత్ నీల్ ప్లాన్ చేస్తున్నాడని.. అందుకే కొన్ని సన్నివేశాలను జోడించి స్క్రిప్ట్ లో మార్పులు చేర్పులు చేస్తున్నాడనే వార్తలు కూడా వచ్చాయి. ఆ సమయంలో కన్నడ సినీ వర్గాల నుండి కూడా ప్రశాంత్ నీల్ సలార్ ను రెండు పార్ట్ లు గా చేసే ఆలోచనతో ఉన్నాడు అనే వార్తలు వినిపించాయి.ఇప్పటికి కూడా సలార్ రెండు పార్ట్ లుగా వస్తుందని ప్రభాస్ అభిమానులు భావిస్తున్నారు. కానీ ఇప్పటి వరకు సలార్ పార్ట్ ల గురించి ఎలాంటి క్లారిటీ అయితే లేదు. వచ్చే ఏడాది సినిమా వస్తుందా లేదా అనే అనుమానాలు అయితే ఉన్నాయి.సలార్ సినిమా షూటింగ్ పూర్తి అయిన వెంటనే ఎన్టీఆర్ తో ప్రశాంత్ నీల్ సినిమా ప్రారంభం కాబోతుందట. కనుక సలార్ సినిమా రెండు పార్ట్ లుగా వస్తుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కేజీఎఫ్ రెండు పార్ట్ ల మధ్య గ్యాప్ రాలేదు. కనుక సలార్ ని ఒక వేళ రెండు పార్ట్ లు గా తీసుకు రావాలని ప్రశాంత్ నీల్ భావిస్తే గ్యాప్ ఇవ్వడు. అప్పుడు ఎన్టీఆర్ సినిమా కు మరింత సమయం పట్టే అవకాశం ఉంది.కానీ ఎన్టీఆర్ తో వచ్చే ఏడాది చివర్లోనే సినిమా ఉంటుందని ప్రశాంత్ నీల్ కాంపౌండ్ నుండి లీక్ వస్తుంది. కనుక సలార్ సినిమా రెండు పార్ట్ లుగా రాబోతుంది అనే వార్తలు నిజం కాకపోవచ్చు అంటూ చాలా మంది బలంగా వాదిస్తున్నారు. ఈ విషయమై స్పష్టత కోసం ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# హిట్ 2 టీమ్ ఊపిరి పీల్చుకున్నట్టేనా?

అడివి శేష్ నటించిన లేటెస్ట్ ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ 'హిట్ 2'. మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'హిట్'కు ఫ్రాంచైజీగా శైలేష్ కొలను తెరకెక్కించాడు. నేచురల్ స్టార్ నాని నిర్మించిన ఈ మూవీ ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. టీజర్ ట్రైలర్ లతో ఆసక్తిని రేకెత్తించి ప్రేక్షకుల్లో భారీ బజ్ ని క్రియేట్ చేసిన ఈ మూవీ ఫస్ట్ డే ఫస్ట్ షోతో పాజిటివ్ టాక్ తో మంచి ఆదరణ ని సొంతం చేసుకుంటోంది.బ్యాక్ టు బ్యాక్ హిట్ లని సొంతం చేసుకుంటూ వస్తున్న అడివి శేష్ ఈ మూవీతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. అలాగే హీరో నాని కూడా ఈ మూవీతో నిర్మాతగా మరో విజయాన్ని సొంతం చేసుకున్నాడు. మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ గా తెరకెక్కింకిన ఈ మూవీలో అడివి శేష్ తనదైన నటనతో కెడీ పాత్రలో ఆకట్టుకుంటున్నాడు. ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్ ని తొలి రోజే సొంతం చేసుకన్న ఈ మూవీ తొలి రోజు మంచి వసూళ్లని రాబట్టినట్టుగా తెలుస్తోంది. ఇదిలా వుంటే ఈ మూవీకి సంబంధించిన కీలక ఘట్టం గురించి మేకర్స్ టెన్షన్ పడ్డారు. సైకో థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ మూవీలోని కీ హైలైట్ సైకో క్యారెక్టర్ ఆ క్యారెక్టర్ ని సోషల్ మీడియా వేదికగా ప్రేక్షకులు నెటిజన్ లు లీక్ చేస్తే ఇలాంటి సినిమాలకు అదే పెద్ద మైనస్ గా మారుతూ వుంటుంది.ఆ కారణంగా అసలు సీక్రెట్ బయటపడటంతో ప్రేక్షకులు ఈ మూవీ థియేటర్ కు వచ్చి చూసేందుకు ఆసక్తిని చూపించరు.ఈ విషయాన్ని ముందే గ్రమించిన హిట్ 2 టీమ్ హీరో అడివి శేష్ హీరో నాని సైకో ని సోషల్ మీడియా వేదికగా ఎక్కడా రివీల్ చేయకూడదని అభ్యర్థించారు. అది చాలా వరకు ఉపయోగపడింది. హంతకుడు ఎవరు?.. ఎలా వుంటాడు? .. తను హత్యలు ఎందుకు చేస్తాడనే విషయాల్ని రివీల్ కానివ్వకుండా 'హిట్ 2' టీమ్ కు నెటిజన్ లు సహకరించారు.దీంతో 'హిట్ 2' టీమ్ ఊపరి పీల్చుకుందని తెలుస్తోంది. మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ మూవీకి కొనసాగింపుగా రానున్న 'హిట్ 3'లో నేచురల్ స్టార్ నాని నటించబోతున్న విషయం తెలిసిందే.




# విధిరాత నుంచి విష్ణుమూర్తి కూడా తప్పించుకోలేడా..!




సక్సెస్ ఫెయిల్యూర్స్ తో సంబంధం లేకుండా వరుస విభిన్నమైన సినిమాల్లో నటిస్తూ ప్రత్యేకతని చాటుకుంటున్నారు యంగ్ హీరో ఆది సాయికుమార్. తన నటిస్తున్నలేటెస్ట్ మూవీ 'టాప్ గేర్'. రియా సుమన్ కథానాయికగా నటించింది. క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఈ మూవీని కె. శశికాంత్ తెరకెక్కిస్తున్నారు. శ్రీధనలక్ష్మీ ప్రొడక్షన్స్ ఆదిత్య మూవీస్ అండ్ ఎంటర్ టైన్ మెంట్స్ సమర్పణలో కె.వి. శ్రీధర్ రెడ్డి నిర్మిస్తున్నారు. డిసెంబర్ 30న ఈ మూవీని భారీ స్థాయిలో రిలీజ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రమోషన్స్ ని స్టార్ట్ చేసింది.ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ టైటిల్ మోషన్ పోస్టర్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. ఆ తరువాత సిధ్ శ్రీరామ్ పాడిన 'వెన్నెల పాట' ప్రస్తుతం నెట్టింట ట్రెండ్ అవుతూ సినిమాపై మంచి బజ్ ని క్రియేట్ చేసింది. ఇదిలా వుంటే తాజాగా శనివారం ఈ మూవీ టీజర్ ని దర్శకుడు మారుతి విడుదల చేశారు.అత్యంతం ఆసక్తికర మలుపులతో సాగుతున్న ఈ టీజర్ ఆసక్తినిరేకెత్తిస్తూ విశేషంగా ఆకట్టుకుంటోంది. తాజాగా దర్శకుడు మారుతి రిలీజ్ చేసిన టీజర్ ఆకట్టుకుంటోంది. సినిమాలో హీరో ఆది సాయికుమార్ టాక్సీ నడిపే వ్యక్తిగా కనిపించనున్నట్టుగా తెలుస్తోంది.గ్రీన్ సిగ్నల్ పడగానే ఎల్లో ట్యాక్సీ వెళుతున్న దృశ్యాలతో ఒక నిమిషం 20 సెకండ్ల నిడివితో టీజర్ మొదలైంది. వెంటనే ఫోన్ రింగ్ కావడం.. ఆది లిఫ్ట్ చేయడంతో ...విధి రాతనుంచి విష్ణు మూర్తి కూడా తప్పించుకోలేకపోయాడు అన్నది ఎంత నిజమో.. నా నుంచి నువ్వు తప్పించుకోలేవన్నది కూడా అంతే నిజం.. ఇప్పుడు రెండు ప్రాణాలు పోతాయ్..' అంటూ ఓ వాయిస్ ఆదిని బెదిరించడం.. కార్ ముందుకు సాగుతున్న క్రమంలో వైపర్స్ కదులుతున్న క్రమంలో సినిమాలో వున్న ప్రధాన పాత్రలని చూపించిన తీరు ఆకట్టుకుంటోంది.అంతే కాకుండా వాయిస్ ఆగిన మరుక్షణమే గన్ తో ఓ వ్యక్తి ఆదిని బెదిరించడం.. తనని వెంబడిస్తున్న వారి నుంచి తప్పించుకుంటూ ఆది కారులో ప్రయాణిస్తున్న తీరు.. ఫైనల్ గా ఆది ప్రయాణిస్తున్న కార్ ని పోలీసులు వెంబడించడం..

# షకీబ్ బౌలింగ్ గురించి చిన్న పిల్లలకు తెలుసు! భారత బ్యాటర్లకు మాత్రం..



బంగ్లాదేశ్తో తొలి వన్డేలో భారత జట్టు ఓటమిని చవిచూసిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్లో బౌలర్లు అద్భుతంగా రాణించినప్పటికీ.. బ్యాటర్లు మాత్రం పూర్తిగా విఫలమయ్యారు.అదే విధంగా కేఎల్ రాహుల్ కీలక సమయంలో క్యాచ్ జారవిడిచడం మ్యాచ్ ఫలితాన్నే మార్చేసింది. అయితే బంగ్లాదేశ్ వంటి చిన్న జట్టుపై ఓటమిని అభిమానులతో పాటు మాజీలు కూడా జీర్ణించుకోలేకపోతున్నారు.కొంత మంది టీమిండియాకు మద్దతుగా నిలుస్తుంటే.. మరి కొంత మంది విమర్శల వర్షం ?కురిపిస్తున్నారు. ఇక తాజాగా ఇదే విషయంపై పాకిస్తాన్ మాజీ స్పిన్నర్ డానిష్ కనేరియా స్పందించాడు. బంగ్లాదేశ్ స్పిన్నర్ షకీబ్ అల్ హసన్ బౌలింగ్ను అర్థం చేసుకోవడంలో భారత బ్యాటర్లు విఫలమయ్యారని విమర్శించాడు. కాగా ఈ మ్యాచ్లో ఐదు వికెట్లు పడగొట్టిన షకీబ్ బంగ్లా విజయంలో కీలక పాత్ర పోషించాడు."షకీబ్ అల్ హసన్ అద్భుతంగా బౌలింగ్ చేయగలడు. ఈ మ్యాచ్లో కూడా రాణించాడు. అయితే అతడు చాలా ఏళ్లుగా జట్టుతో ఉన్నాడు. ఐపీఎల్ కూడా ఆడుతున్నాడు. అయినప్పటికీ అతడి బౌలింగ్ ఎలా ఉంటుందో, అతడిని ఎలా ఎదుర్కోవాలో భారత బ్యాటర్లకు ఇంకా అర్థం కాలేదా? వాళ్లెందుకిలా చేశారో తెలియదు.ఇలాంటి సమయంలో బంతి పిచ్పై పడిన వెంటనే టర్న్ అవుతుందన్న విషయం చిన్న పిల్లలకు కూడా తెలుసు. కానీ టీమిండియా క్రికెటర్లు ఆ విషయం తెలుసుకో లేకపోయారు" అంటూ తన యూట్యూబ్ ఛానల్లో కనేరియా పేర్కొన్నాడు.

## ప్రపంచకప్కు భారత జట్టు ప్రకటన.. తెలంగాణ అమ్మాయికి ఛాన్స్

దక్షిణాఫ్రికా వేదికగా జరగున్న తొలి అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్కు భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. ఈ జట్టుకు భారత సీనియర్ జట్టు విధ్వంసకర ఓపెనర్ షఫాలీ వర్మ నాయకత్వం వహించనుంది.కాగా షఫాలీ వర్మ సీనియర్ జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్నప్పటకీ.. ఇంకా 19 ఏళ్లు పూర్తి కాకపోవడంతో అండర్-19 జట్టుకు ఎంపికైంది.అదే విధంగా భారత వికెట్ కీపర్ రిచా ఘోష్ కూడా ఈ జట్టులో భాగమైంది. ఇక షాఫాలీ డిప్యూటీగా శ్వేతా షెరావత్ వ్యవహరించనుంది. శ్వేతా షెరావత్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్లో ఉంది. ఇటీవల ముగిసిన అండర్-19 ఛాలెంజర్ ట్రోఫీలో అత్యధిక పరుగుల సాధించిన బ్యాటర్గా షెరావత్ నిలిచింది. అదే విధంగా ప్రపంచకప్ జట్టులో తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిషకు చోటు దక్కింది. ఇక ఈ మెగా ఈవెంట్ వచ్చే ఏడాది జనవరి 14 నుంచి ప్రారంభం కానుంది. అండర్-19 ప్రపంచకప్కు భారత జట్టు: షఫాలీ వర్మ (కెప్టెన్), శ్వేతా సెహ్రావత్ (వైస్ కెప్టెన్), రిచా ఘోష్ (వికెట్ కీప్), జి త్రిష, సౌమ్య తివారీ, సోనియా మెహదియా, హర్లీ గాలా, హృషితా బసు, సోనమ్ యాదవ్, మన్నత్ కశ్యప్, అర్చన దేవి, పార్శవి చోప్రా, టిటాస్ సాధు , ఫలక్ నాజ్, షబ్నమ్

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190